ప్రజాశక్తి

బుధవారం 11 సెప్టెంబర్ 2024

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

ఉక్కు గర్జన



కూర్మన్నపాలెం కూడలిలో రాస్తారోకో నిర్వహిస్తున్న ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు, కార్మికులు



ద్వారకానగర్ బస్ స్టేషన్ వద్ద నిరసన చేపడుతున్న అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి నాయకులు

- స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు రాస్తారోకోలు
- అన్ని తరగతుల నుంచీ విశేష మద్దతు
- విశాఖలో పలువురు అరెస్టు
- కూర్మన్నపాలెం కూడలిలో ఉద్రిక్తంగా మారిన ఆందోళన
- ప్రభుత్వ అరెస్టుల పర్వాన్ని ఖండించిన ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - విలేకరుల యంత్రాంగం

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం ఉమ్మడి విశాఖలో పిడికిళ్లు బిగిశాయి. ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేయొద్దని లక్షల గొంతులు నినదించాయి. పూర్తి ఉత్పత్తి సామర్థ్యంతో నడపాలని, సెయిల్‌లో విలీనం చేయాలని కోరాయి. ముఖ్యంగా విశాఖ నగరం ఉక్కు నినాదాలతో మంగళవారం హోరెత్తింది. ఉక్కు రక్షణ కోసం చేపట్టిన రాస్తారోకోలు అన్నిచోట్లా జయప్రదమయ్యాయి. కార్మికులు, రైతులు, వివిధ తరగతుల ప్రజానీకం పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కార్మిక, ప్రజా సంఘాల నుంచి విశేష మద్దతు దక్కింది. ఉక్కును అమ్మేవారి అంతుచూస్తామని పెద్దపెట్టున ప్రజానీకం నినదించింది. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద, పాత మిగతా 2లో..

సిపిఎం కార్పొరేటర్ గంగారావును అరెస్టు చేస్తున్న పోలీసులు





అనకాపల్లిలో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి లోకనాథం

విఎంఆర్‌డిఎ అభివృద్ధి పనులపై సమీక్ష

వార్త 2లో..

పలువురు ఇన్‌స్పెక్టర్లు బదిలీ

వార్త 8లో..

గొప్ప కవి దాశరథి కృష్ణమాచార్య

వార్త 2లో..

కేసుల ఛేదనలో ముందంజ

సిపి శంఖబ్రాత బాగ్చి



రికవరీ సొత్తును అందజేస్తున్న సిపి శంకబ్రాత బాగ్చి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ నగరంలో కేసులను ఛేదించడంలో ముందంజలో ఉన్నామని విశాఖ నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రాత బాగ్చి అన్నారు. ఆగస్టు నెల రికవరీ మేళాను మంగళవారం పోలీసు కమిషనరేట్ పరిధిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు నెలలో 112 కేసులు నమోదు అయ్యాయన్నారు. జులైలో 89 కేసులను విజయవంతంగా ఛేదించి 80 మందిని అరెస్టు చేశామన్నారు. చోరీ కాబడిన సొత్తులో రూ.22,37,600 విలువైన వస్తువులను రికవరీ చేశామన్నారు. ఆగస్టు నెలలో రికవరీ చేసిన సొత్తులో 555.05 గ్రాముల బంగారం, రూ.46,800 నగదు, 17 ద్విచక్ర వాహనాలు, 4 ఆటోలు, 267 మొబైల్ ఫోన్‌లు, 5 చీరలు, 450 కేజీల ఐరన్ సెంట్రింగ్ పైప్స్, కాపరు ఎలక్ట్రిక్ వైర్లు ఉన్నాయని తెలిపారు. నగరవ్యాప్తంగా 554 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. రాత్రి వేళలో గస్తీ నిర్వహణను మరింత పటిష్ఠం చేశామని తెలిపారు. ఆగస్టు నెలలో చాట్ బాట్ ద్వారా 38.25 లక్షల విలువగల 255 మొబైల్ ఫోన్లను మిగతా 2లో..

రమాదేవికి సరోజా వైద్యనాథన్ పురస్కారం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రముఖ కూచిపూడి నర్తకీమణి, నాట్య పరిశోధకురాలు, ప్రయోక్త, రచయిత్రి డాక్టర్ పి.రమాదేవి డాక్టర్ సరోజా వైద్యనాథన్ ఎక్స్‌లెన్స్ పురస్కారం - 2024కు ఎంపికయ్యారు. జాతీయ, అంతర్జాతీయ నృత్యోత్సవాల నిర్వహణలో పేరెన్నికగన్న నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యాన కళాభారతి ఆడిటోరియంలో ఈ నెల 27, 28, 29 తేదీలలో మూడు రోజులపాటు జరగనున్న 16వ అఖిలభారత శాస్త్రీయ నృత్యోత్సం 'వైశాఖీ నృత్యోత్సవ్' సన్నాహాలు ఇప్పటికే మొదలయ్యాయి. దేశ విదేశాలకు చెందిన మెరికల్లాంటి శాస్త్రీయ నృత్య కళాకారులతో రోజూ సాయంత్రం కోలాహలంగా నిర్వహించే ఈ ఉత్సవాల సందర్భంగా ఆయా కళాకారుల స్థాయి, నాట్య రంగంలో చేసిన కృషినిబట్టి నిపుణులకిచ్చే గౌరవ పురస్కారాల కోవలో ప్రతి ఏటా ఇచ్చే డాక్టర్ సరోజా వైద్యనాథన్ పేరిట నెలకొల్పిన ఎక్స్‌లెన్స్ పురస్కారానికి రమాదేవిని ఎంపిక చేసినట్టు ఎఎండిఎ వ్యవస్థాపక అధ్యక్షులు బత్తిన రంగ విక్రమ్ కుమార్ గౌడ్ తెలిపారు.

వరద బాధితులను ఆదుకున్నాం

- ప్రకాశం బ్యారేజీ విధ్వంసానికి జగన్ కుట్ర
- రాష్ట్ర హోం శాఖ మంత్రి అనిత

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలూ చేపట్టిందని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. మంగళవారం మధ్యాహ్నం విశాఖలోని ప్రభుత్వ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ విపత్తుల నిర్వహణలో సిఎం చంద్రబాబు ఆదర్శంగా నిలిచారన్నారు. నిరంతరం సమీక్షలు, క్షేత్రస్థాయి పర్యటనలతో యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టామన్నారు. వరద ప్రాంతాలలో పునరుద్ధరణ, సహాయక చర్యలకు కలెక్టర్లకు పూర్తి స్వేచ్ఛనిచ్చామని, అవసరమైన నిధులను అందుబాటులో ఉంచామని అన్నారు. వార్డుకో సీనియర్ ఐఎఎస్, కాలనీకి ఓ మంత్రిని నియమించి బాధితులను ఆదుకున్నామన్నారు. బుడమేరు గండ్లను అంత త్వరగా పూడ్చటం ఏమంత చిన్న విషయం కాదన్నారు. ప్రకాశం బ్యారేజీ విధ్వంసానికి మాజీ సిఎం వైఎస్.జగన్ నాయకత్వంలో కుట్ర జరిగిందని ఆరోపించారు. ఉద్దండరాయునిపాలెంలో ఉండాల్సిన పడవలు అక్కడికి ఎలా వచ్చాయో విచారణ చేపట్టామని తెలిపారు. బోట్ల మిగతా 2లో..



మాట్లాడుతున్న అనిత

మొదటి పేజీ తరువాయి..

ఉక్కు గర్జన

గాజువాక జంక్షన్, జాతీయ రహదారిపై శాంతియుతంగా జరుగుతున్న రాస్తారోకోలను భగ్నం చేయడానికి పోలీసులు ప్రయత్నించి విఫలమయ్యారు. 65 మందిని పోలీసులు అరెస్టు చేశారు. అయినప్పటికీ వెరవకుండా పోరాటస్ఫూర్తితో ఉద్యమాన్ని అన్నిచోట్లా కార్మికులు, ప్రజలు ముందుకు తీసుకెళ్లారు. గడిచిన మూడున్నర సంవత్సరాల్లో ఎన్నడూ లేని విధంగా పోలీసులు అరెస్టులకు పూనుకోవడాన్ని విశాఖ ఉక్కు పోరాట కమిటీ తీవ్రంగా ఖండించింది. కూర్మన్నపాలెం కూడలిలో పోరాట కమిటీ దీక్షా శిబిరం వద్ద చేపట్టిన రాస్తారోకో విజయవంతమైంది. మంగళవారం ఉదయానికే పోలీసులు ఇక్కడ పెద్ద సంఖ్యలో మోహరించడంతో ఉద్రిక్త పరిస్థితులు అలుముకున్నాయి. పోలీసులు ఆందోళనకారులను ఎక్కడికక్కడ అడ్డుకునే ప్రయత్నం చేశారు. రాస్తారోకో చేస్తున్న 15 మంది కీలక నాయకులను అరెస్టు చేసి, మధ్యాహ్నం విడుదల చేశారు. అరెస్టయిన వారిలో పోరాట కమిటీ ఛైర్మన్లు సిహెచ్.నర్సింగరావు, డి.ఆదినారాయణ తదితరులు ఉన్నారు. విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన జివిఎంసి గాంధీ విగ్రహం నుంచి ఆర్‌టిసి కాంప్లెక్స్ వరకూ నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం రాస్తారోకో నిర్వహించారు. అలాగే విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో పలుచోట్ల ఆందోళనలు కొనసాగాయి.

ఉక్కు ఉద్యమకారులపై ప్రభుత్వ నిర్బంధం అమానుషం

- సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గు నాయుడు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ, విశాఖ కలెక్టరేట్ : స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం కూర్మన్నపాలెం, గాజువాక ప్రాంతాల్లో శాంతియుతంగా రాస్తారోకోలు చేస్తున్న ఉద్యమకారులను రాష్ట్ర ప్రభుత్వం అరెస్టు చేయించి స్టీల్‌ప్లాంట్, గాజువాక పోలీస్ స్టేషన్‌లలో నిర్బంధించం దుర్మార్గమని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అక్రమ అరెస్టులను ఖండించారు. కేంద్రంలో బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వ పాలనకు రాష్ట్రంలోని తెలుగుదేశం, జనసేన పార్టీలు ఆక్సిజన్ అందిస్తున్నాయని, ఇంతటి కీలక స్థితిలో ఉన్న టిడిపి, జనసేనల అధినాయకత్వాలు మోడీ ప్రభుత్వ మెడలు వంచి స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని ఆపించి, అభివృద్ధి బాట పట్టిస్తాయని ఉక్కు కార్మికులు, విశాఖ ప్రజలు అత్యంత ఆశాభావంతో ఉన్నారన్నారు. కానీ మోడీ, చంద్రబాబు ప్రభుత్వాలు ప్రమాణ స్వీకారం చేసి మూడు నెలలు గడుస్తున్నా, ఎటువంటి సానుకూల నిర్ణయం తీసుకోలేదని, పైగా మోడీ ప్రభుత్వం స్టీల్ ప్లాంట్‌ను రోజురోజుకూ అగాధంలోకి నెడుతోందని తెలిపారు.

సిఐటియు ఖండన

అక్రమ అరెస్టులను సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ ఒక ప్రకటనలో ఖండించారు. ఈ అక్రమ అరెస్టులకు బెదిరిపోయేది లేదని, భవిష్యత్తులో ఉక్కు పోరాటం మరింత ఉధృతం కానుందని తెలిపారు.

వరద బాధితులను ఆదుకున్నాం

యజమానులు ఉషాద్రి, కోమటి రామ్మోహన్ అని తేలిందని చెప్పారు. ఈ పడవల వల్లే 67, 68 గేట్లు ధ్వంసమయ్యాయన్నారు. మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ కృష్ణలంక రిటైనింగ్ వాల్ టిడిపి ప్రభుత్వ హయాంలోనే సగం పూర్తయిందని తెలిపారు.

కేసుల ఛేదనలో ముందంజ

రికవరీ చేయడం జరిగిందని, వాటిని బాధితులకు అందించామని వెల్లడించారు. మీడియా సమావేశంలో జాయింట్ కమిషనర్ కె.ఫకీరప్ప, క్రైం డిసిపి కె.లతా మాధురి, ఇతర పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

గొప్ప కవి దాశరథి కృష్ణమాచార్య

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నిజాం నిరంకుశ పాలనపై సాహితీ ఉద్యమం చేసిన గొప్ప కవి దాశరథి కృష్ణమాచార్య అని అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. ఎయు తెలుగు శాఖ, అభ్యుదయ రచయితల సంఘం సంయుక్త నిర్వహణలో టిఎల్ఎన్ సభా హాల్లో కళా ప్రపూర్ణ దాశరథి కృష్ణమాచార్య శతజయంతి ఉత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సభలో ఆయన కీలక ఉపన్యాసం చేశారు. నిజాం నిరంకుశ పాలనలో ప్రజల కడగండ్లను చూసి చలించి నిజాంపై అక్షర శస్త్రాలను సంధించారని, సాహితీ పోరాటంతో పాటు సాయుధ పోరాటం కూడా చేశారని తెలిపారు.

విఎంఆర్‌డిఎ అభివృద్ధి పనులపై సమీక్ష



మాట్లాడుతున్న ఎంపీ శ్రీభరత్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ విఎంఆర్‌డిఎ కమిషనర్ కెఎస్.విశ్వనాథన్‌తో కలిసి విఎంఆర్‌డిఎలో చేపట్టిన అభివృద్ధి పనులపై విఎంఆర్‌డిఎ సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీభరత్ మాట్లాడుతూ విశాఖపట్నం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరం కాబట్టి భవిష్యత్తు తరాలు ఇబ్బందులు పడకుండా ఉండాలంటే చక్కటి ప్రణాళికతో ముందుకు వెళ్ళాలని సూచించారు. దీనికి విఎంఆర్‌డిఎ కీలక భూమిక పోషించాల్సి ఉందని తెలిపారు. ప్రస్తుతం అమలులో ఉన్న బృహత్తర ప్రణాళికను ప్రజలు, ప్రజాప్రతినిధులు, ముఖ్యమైన వారితో చర్చించి సవరించడానికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. సిరిపురం జంక్షన్ వద్ద నిర్మిస్తున్న మల్టీ లెవెల్ కార్ పార్కింగ్, కమర్షియల్ కాంప్లెక్స్‌ను త్వరగా పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. కార్యక్రమంలో కార్యదర్శి కీర్తి, చీఫ్ ఇంజినీర్ భవానీ శంకర్, ఎస్టేట్ అధికారి లక్ష్మారెడ్డి, ముఖ్య ప్రణాళికా అధికారి సంజయ్ రత్నకుమార్, ముఖ్య గణాంకాధికారి హరిప్రసాద్, విడిఎ జాయింట్ డైరెక్టర్ శిల్ప, ఎస్‌ఇ బలరామరాజు, డిఎఫ్‌ఒ శాంతి స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

పలువురు ఇన్‌స్పెక్టర్లు బదిలీ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం పోలీస్ కమిషనరేట్ పరిధిలో పలువురు ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి మంగళవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. అందులో భాగంగా ఆనందపురం లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న టివి.తిరుపతిరావు, గాజువాక లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న మరడాన శ్రీనివాసరావులను విశాఖపట్నం రేంజ్ విఆర్‌కు సరెండర్ చేయగా, మూడో పట్టణ లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎ.పార్థసారథిని గాజువాక లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్‌కు, అనకాపల్లి జిల్లా విఆర్‌లో ఉన్న పల్లా రమణయ్యను మూడో పట్టణ లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్‌కు, అల్లూరి సీతారామరాజు జిల్లా ఎన్‌డిపిఎస్ టాస్క్ ఫోర్స్‌లో పనిచేస్తున్న చింత వాసునాయుడును ఆనందపురం లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేస్తూ ఈ ఉత్తర్వులు ఇచ్చారు. తక్షణమే అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు.



విరాళం అందజేస్తున్న దృశ్యం

క్రెడాయ్ రూ.10 లక్షల విరాళం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విజయవాడ వరద బాధితుల సహాయార్థం క్రెడాయ్ విశాఖపట్నం ఛాప్టర్ ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.10 లక్షల విరాళాన్ని అందించింది. కార్యక్రమంలో క్రెడాయ్ ఎపి ప్రధాన కార్యదర్శి బి.శ్రీనివాసరావు, విశాఖపట్నం ఛాప్టర్ ఛైర్మన్ కెఎస్ఆర్‌కె.రాజు (సాయి), వి.ధర్మేందర్ పాల్గొన్నారు.

IN THE HON'BLE COURT OF THE II ADDL. SENIOR CIVIL JUDGE AT: VISAKHAPATNAM
E.P.156/2022 in O.S.310/2015

Between:
Sri Pediredla Suryanarayana Murthy (died) & others ...D.Hrs/Plaintiffs
And:
Smt. Pediredla Kumari and 3 others ....J.Drs/Defendants

NOTICE

To,
J.Dr-1: **Smt. Pediredla Kumari,** W/o. Late P. Appa Rao, Hindu, aged about 57 years, R/at D.No.49-28-2/1,Madhuranagar, Seethammapeta, Visakhapatnam
J.Dr-2: **Smt. Danina Chandrika,** W/o. Latish, Hindu, aged about 36 years, Rest-do-
J.Dr-3: **Sri Pediredla Vikas,** S/o. late P. Appa Rao, Hindu, aged 35 years, Rest-do-
J.Dr-4: **Pediredla Hemalatha,** D/o.late P. Appa Rao, Hindu, aged about 33 years, Rest-do-

Please take notice that the above named D.Hrs/plaintiffs has filed the above E.P.156/2022 in O.S.310/2015 against you and the matter stands posted to **27-09-2024** for your appearance.Therefore you are hereby required to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **27-09-2024** at **10:30 A.M** to answer all material questions, failing which the matter will be heard and determined in your absence, ex-parte as per law.

P. RAMA RAO,
P.S. RAVI CHANDRA RAO,
Advocates, Visakhapatnam.

IN THE HON'BLE COURT OF THE IV ADDL. JUNIOR CIVIL JUDGE AT: VISAKHAPATNAM
O.S.1440/2023

Between:
Sri Karri Venkata Krishna Reddy ...Plaintiff
And:
Sri Darsi Eswara Rao ...Defendant

SUMMONS

To, **The Defendant:**
Sri Darsi Eswara Rao,
S/o. Thathamma, Hindu, Agedabout 49 years, working as Sr. Foreman-Mechanical, E.No.119142, ES & F Foundry Shop, Visakhapatnam Steel Plant, Ukkunagaram, Visakhapatnam

Whereas the abovenamed plaintiff instituted the above suit for recovery of money against defendant. The above suit stands posted to **17-10-2024** at **10:30 A.M** for your appearance of defendant in the above Court in person or by a Pleader duly instructed and able to give answer of all material question relating to the above suit or who shall be accompanied by some person on that day, failing which the above suit will be decided in your absence as set ex-parte.

M.V. RAMAKRISHNA REDDY,
Advocate
Visakhapatnam.
Cell: 9849357276.

మహారాజశ్రీ అనకాపల్లి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.396 / 2023

బిట్వీన్: కొయ్య వెంకట లక్ష్మి . . . వాది
అండ్:
శిమ్మ సింహాచలం వగైరాలు . . . ప్రతివాదులు

సమను

టు:
9వ ప్రతివాది: మిరియాల సత్యనారాయణ, తండ్రి బలరామునాయుడు, వయస్సు 49 సం॥, హిందూ, వెంకటాపురం విలేజ్, తానం పోస్ట్, మునగపాక మండలం, అనకాపల్లి జిల్లా.

పై నెంబరు దావాలో వాది 1 నుండి 11 ప్రతివాదులుపై తనఖా బాకీ వసూలు నిమిత్తం పై కోర్టులో దావా వేయగా సదరు దావా యందు శ్రీ కోర్టు వారు పంపిన సమన్లు మీరు అందు కోనందన సదరు కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **తే:23-9-2024దీకి** వాయిదా వేసియున్నారు. కావున ఆ రోజు **ఉదయం 10-30 ని॥లకు** మీరు స్వయంగా గాని లేక మీ తరపున లాయరుగారు గాని పై కోర్టులో హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకోన వలెను. లేనిచో మీ పరోక్షమందు పై దావా తీర్మానించబడునని. ఈ పేపరు ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఆర్డర్)
ఎం. శ్రీనివాసరావు
అడ్వకేట్, అనకాపల్లి.

మహారాజశ్రీ నర్సీపట్నం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.56 / 2006 E.P. 45/2019 E.A.41/2023

వాది / పిటిషనరు / డి.హెచ్.ఆర్.:
దొడ్డి దుర్గారావు
ప్రతివాదులు / రెస్పాన్డేంట్లు / జె.డి.ఆర్లు:
మంజు చిట్స్ & ఫైనాన్స్ కంపెనీ, నర్సీపట్నం రిప్రేసెంటెడ్ బై ఇట్స్ పార్టనర్ యర్రంశెట్టి వెంకట రమణమ్మ మరి ముగ్గురు.

సి.పి.సి. ఆర్డరు 5 రూలు 20 ప్రకారము ప్రతివాదులు / రెస్పాన్డేంట్లు/జే.డి.ఆర్డరు 21 రూలు 106 ప్రకారం అమలు నోటీసు ప్రకటన

1వ ప్రతివాది/జె.డి.ఆర్:
మంజు చిట్స్ & ఫైనాన్స్ కంపెనీ, నర్సీపట్నం రిప్రేసెంటెడ్ బై ఇట్స్ పార్టనర్ యర్రంశెట్టి వెంకట రమణమ్మ, భర్త లేటు నారాయణరావు సా॥ ఇంటి నెం.10-6-20/8, 1వ ఫ్లోర్, సాయిబాబా టెంపుల్ మార్కెట్ వీధి ఎదురుగా రాంనగర్, విశాఖపట్నం.

2వ ప్రతివాది/జె.డి.ఆర్:
యర్రంశెట్టి వెంకట రమణమ్మ, భర్త లేటు నారాయణరావు, సా॥ ఇంటి నెం.10-6-20/8, 1వ ఫ్లోర్ సాయిబాబా టెంపుట్ మార్కెట్ వీధి ఎదురుగా, రాంనగర్, విశాఖపట్నం.

3వ ప్రతివాది/జె.డి.ఆర్:
యర్రంశెట్టి వెంకట సత్య మంజుల, భర్త లేటు నారాయణరావు, సా॥ ఇంటి నెం.10-6-20/8, 1వ ఫ్లోర్ సాయిబాబా టెంపుట్ మార్కెట్ వీధి ఎదురుగా, రాంనగర్, విశాఖపట్నం.

4వ ప్రతివాది/జె.డి.ఆర్:
యర్రంశెట్టి శ్రీనివాస కార్తీక్, భర్త లేటు నారాయణరావు, సా॥ ఇంటి నెం.10-6-20/8, 1వ ఫ్లోర్ సాయిబాబా టెంపుట్ మార్కెట్ వీధి ఎదురుగా, రాంనగర్, విశాఖపట్నం.

పై నెంబరు పిటిషన్‌లో ప్రతివాదులు/ రెస్పాన్డేంట్లు/జె.డి.ఆర్లు అయిన మీకు పలు పర్యాయములు కోర్టు నుండి మరియు రిజిస్టరు పోస్టు ద్వారానూ పిటిషన్ నోటీసులు పంపినప్పటికీ మీరు అందుకొని యుండలేదు. అందుపై శ్రీకోర్టు వారు మీకు పిటిషన్ నోటీసులు పత్రికా ప్రకటన ద్వారా పంపమని ఉత్తరువులు జారీ చేయించియున్నారు.

కాగా ఇందుమూలముగా మీకు తెలియ జేయునది ఏమనగా పై నెంబరు అమలు శ్రీకోర్టు వారు **తే:19-09-2024కు** వాయిదా వేయించి ఉన్నారు. **తే:19-09-2024దిన** మీరు స్వయంగా కాని న్యాయవాది ద్వారా గాని హాజరయి మీకు ఏమైనా ఆక్షేపణలున్న యెడల శ్రీకోర్టు వారికి తెలియజేసుకోనవలెను. లేని యెడల మీకు ఎట్టి ఆక్షేపణలు లేవని ఎంచి మీ పరోక్షములో శ్రీకోర్టు వారు తమ ముందున్న దస్తావేజుల ఆధారముగా తీర్పు చెప్పదరు.

వాయిదా తేది: 19-09-2024

మెట్ట ప్రభాకర్
న్యాయవాది, నర్సీపట్నం.
సెల్: 8179154586, 7989015974

నర్సీపట్నం,
తే:10-9-24

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE, SRIKAKULAM
O.S.No.61/2023

BETWEEN:
Potnuru Vasu, S/o Late Thavitayya, Aged about 51 years, Gorlevari Street, Srikakulam Town, Corporation and Dist., ...PLAINTIFF
AND
Shaik Sameer, S/o Shaik Anwar, Aged about 41 years, Hayathinagaram, Gujarathipeta, Srikakulam Town & Dist., Presently residing at Flat No.110, 1st Floor, 'B' Block, Hill View Residency, ARILOVA, VISAKHAPATNAM. ...DEFENDANT

NOTICE

Defendant (Respondent):
SHAIK SAMEER, S/O SHAIK ANWAR, HAYATHINAGARAM, GUJARATHIPETA, SRIKAKULAM TOWN & DIST.,PRESENTLY RESIDING AT FLAT NO.110, 1st FLOOR, 'B' BLOCK, HILL VIEW RESIDENCY, ARILOVA, VISAKHAPATNAM.

ఇందు మూలముగా మీకు తెలియచేయునది ఏమనగా పై నంబరు దావా మరియు పిటిషను (I.A.311/2023) మీ యొక్క నోటిసు, హాజరు నిమిత్తము తే.18-09-2024 దీ నాటికి వాయిదా పడి యున్నది. కావున పై దావా, పిటిషను విషయములో మీకు ఆక్షేపణలు ఉన్న యెడల పై తేదిన పగలు 10-30 గంటలకు ఖుద్దున గాని వకీలు ద్వారా గాని పై కోర్టులో హాజరు అయి కోర్టు వారితో మనవి చేసుకోవలసినది. లేని యెడల సదరు విషయములో మీ పరోక్షమందు విచారించి తీర్మానము చేయుదురని తెలియచేయడమైనది.

S.GOVINDA RAJULU, (GOPI),
Advocate for Plaintiff,
Arasavilli, Srikakulam.
Mobile No. 9440112388

బహిరంగ ప్రకటన

ఈ దిగువ పేర్కొన్న షెడ్యూలు దాఖలా ఆస్తిని విశాఖపట్నం జిల్లా కాపురస్తులు అయిన 1) కొయ్య గురుమూర్తి S/o లేటు పైడియ్య, 2) కొయ్య రమణ S/o లేటు పైడియ్య, 3) జీరు సూరి @ సూర్యనారాయణ S/o లేటు అప్పయ్య, 4) జీరు గురుమూర్తి S/o సూరి @ సూర్యనారాయణ, 5) జీరు రమణ S/o సూరి @ సూర్యనారాయణ, 6) జీరు బంగారు రెడ్డి S/o సూరి @ సూర్యనారాయణ, 7) జీరు ఆదియ్య S/o లేటు అప్పయ్య, 8) జీరు సురేష్ S/o ఆదియ్య. 9) జీరు పోలిరెడ్డి S/o ఆదియ్య, 10) జీరు రాజేష్ S/o ఆదియ్య మరియు 11) జీరు అప్పలరెడ్డి S/o లేటు అప్పయ్య మీరందరూ ఏకస్తులై విజయనగరం జిల్లా, భోగాపురం మండలం, రావాడ గ్రామ కాపురస్తులు అయిన శ్రీ పిల్లి లేటు ఆదినారాయణ గారి కుమారుడు అయిన కోటేశ్వర రావు గారికి తే 03-09-2014 దిన క్రయపురోణి వ్రాసియున్నారు. దరిమిలా రెవిన్యూ రికార్డు లలో మీ యొక్క పేరును నమోదు చేసుకున్న పిదప నా క్లయింటు అయిన శ్రీ పిల్లి కోటేశ్వర రావు గారికి రిజిస్ట్రేషన్ చేస్తారని చెప్పియున్నారు. తరువాత కొంతకాలమునకు అనగా తే 31-07-2016దిన మీరందరూ రిజిస్ట్రేషన్ లేకుండా క్రయపత్రం నా క్లయింట్ పేరున వ్రాసియున్నారు. క్రయపురోణి ప్రకారము సెంటు ఒక్కంటికి రూ.15,500/- చొప్పున ఇప్పటికి రూ.3,00,000/- నా క్లయింటు మీకు అడ్వాన్సుగా చెల్లించియున్నారు. శేషించిన క్రయధనము రూ.6,30,000/- తమకు చెల్లించుటకు మా క్లయింటు సిద్ధముగా ఉన్నప్పటికిన్నూ మీరు రిజిస్ట్రేషన్ చేయకుండా కాలయాపన చేస్తున్నారు. కావున ఈ ప్రకటన వెలువడిన 7 రోజులలోగా మీరు నా క్లయింటును గాని లేదా నన్ను కానీ సంప్రదించి సదరు షెడ్యూలు దాఖలా ఆస్తిని నా క్లయింటు పేరున రిజిస్ట్రేషన్ చేయించగలరు అట్లు కానీ యెడల మీ అందరిపై సివిలు చర్య నిమిత్తము సంబంధిత కోర్టులో మీ పై దావా వేయుదుము అని ఇందుమూలముగా తెలియపరచుచున్నాము.

షెడ్యూలు ఆస్తి వివరము:

విజయనగరం జిల్లా, భోగాపురం మండలము, రావాడ గ్రామము, సర్వే నెంబర్ 195-8, ఎకరా 0.19 సెంట్లు మరియు 193-26 లో ఎకరా 0.13 సెంట్లు మరియు ఎకరా 0. 28 సెంట్లు వెరసి మొత్తముఎకరా 0.60 సెంట్లు జిరాయితీ మెట్టు భూమి.

ఇట్లు
M. గణపతి రావు,
M. రవి కుమార్,
P. గురునాథ రావు,
న్యాయవాదులు,
విజయనగరం

వెంటాడుతున్న భయం..

కొండవాలు ప్రజల అవస్థలు

ప్రజాశక్తి -తగరపువలస : భారీ వర్షాలు, తుపాను పేరు వింటేనే కొండవాలు ప్రజల గుండె జారిపోతోంది. నిరంతరాయంగా కురుస్తున్న వర్షాలకు కొండవాలు ప్రాంతాలు ప్రమాదకరంగా మారాయి. ఎప్పుడు ఏమి జరుగుతుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. జివిఎంసి రెండో వార్డు పరిధి సత్యనారాయణపేట కొండవాలులో బండరాయి దొర్లి కింద పడడంతో ఆదివారం రాత్రంతా వారి కంటి మీద కునుకు లేదు. కొండ వాలు ప్రాంతంలో దాదాపు 30కి పైగా కుటుంబాలు ఉంటున్నాయి. కొండపైన, కింద వీరంతా చిన్న చిన్న ఇళ్లల్లో ఉంటున్నారు. సమాచారం తెలుసుకున్న జివిఎంసి ఒకటో జోన్ అధికారులు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది కలిసి రాత్రి వేళ 8 కుటుంబాలను దగ్గర్లో వున్న జివిఎంసి గ్రంథాలయానికి పంపించారు. వర్షం తెరిపిచ్చినా సరే బితుకు బితుకు మంటూ ఉంటున్నట్లు రమణమ్మ, కొండమ్మ, పి.దేవి తదితరులు ప్రజాశక్తి వద్ద వాపోయారు.

భీతి గొలుపుతున్న కొండవాలు

జివిఎంసి ఒకటో వార్డు బంగ్లా మెట్ట హైవేకు అనుకుని ఉన్న కొండవాలు భీతి గొల్పుతోంది.



జివిఎంసి ఒకటో వార్డులో బంగ్లామెట్ట కొండవాలు ఇదే..

కొండవాలుకు ఆనుకుని నివసిస్తున్న బంగారమ్మ, సోమమ్మ రేణుక తదితరులు మాట్లాడుతూ, హైవే విస్తరణ సందర్భంగా ఇల్లు కోల్పోతే రూపాయికి మరో రూపాయి పోగేసి ఇళ్లు కట్టుకున్నామని, రెండ్రోజుల వర్షానికి మట్టి కరిగి, బండరాళ్లు కిందకు పడ్డాయని వారు చూపిస్తూ ఆవేదన చెందారు. పిల్లా పాపలతో ఉన్నాం.. ఏమి చేయాలో తోచడం లేదు అంటూ వాపోయారు. కొండవాలుకు ఆనుకుని దాదాపు 50 ఇళ్లు ఉన్నాయని, వారంతా వర్షాలకు భయపడుతూనే ఉన్నారని చెప్పారు

రక్షణ గోడ నిర్మించాలి

తమ ఇళ్లకు అనుకుని రక్షణ గోడ నిర్మించాలి. లేకుంటే తుపాన్లు, వర్షాలకు ఇళ్లల్లో ఉండే పరిస్థితి లేదు. అధికారులు ఆలోచించాలి.



ఎస్.రేణుక
బంగ్లామెట్ట
జివిఎంసి ఒకటో వార్డు

వాయుగుండం అంటేనే వణుకు

వాయుగుండం అంటేనే వణుకు పుడుతోంది. కురిసిన వర్షాలతో ఇంట్లో ఉండలేక, బయటకు వెళ్ల లేక ఉంటున్నాం. రక్షణ గోడ నిర్మించాలి.



పి.దేవి
సత్యనారాయణ పేట
జివిఎంసి రెండో వార్డు

రిమాండు ఖైదీ వీరంగం

ఎస్కార్ట్ సిబ్బందిపై దాడి

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాఖ కేంద్రకారాగారం వద్ద రిమాండ్ ఖైదీ వీరంగం వేశాడు. ఎస్కార్ట్ సిబ్బంది, జైలు సిబ్బందిపై దాడికి దిగాడు. ఎస్కార్ట్ సిబ్బంది, జైలు అధికారులు ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి... విశాఖ నగరానికి చెందిన గుర్రాల సాయి (30) రౌడీషీటర్ ఒక హత్యతో పాటు మరికొన్ని కేసుల్లో నిందితునిగా ఉన్నాడు. ఏడాది క్రితం నుంచి కేంద్రకారాగారంలో రిమాండ్ ఖైదీగా శిక్ష అనుభవిస్తున్నాడు. సోమవారం ఉదయం కోర్టు వాయిదా నిమిత్తం కేంద్రకారాగారం నుంచి ఎస్కార్ట్ సాయంతో కోర్టుకు తీసుకెళ్లారు. కోర్టు వాయిదా తరువాత తిరిగి కేంద్రకారాగారానికి తీసుకొచ్చారు. కేంద్రకారాగారం లోపలికి వెళ్లేందుకు నిరాకరిస్తూ వీరంగం సృష్టించాడు. ఎస్కార్ట్ సిబ్బందిని దూషిస్తూ వారి మీద దాడి చేశాడు. బలవంతంగా లోపలకు పంపించారు. లోపల ఉన్న సిబ్బంది కౌంటర్ అద్దాలు పగులగొట్టి వారిపైనా దాడికి యత్నించాడు. దీంతో జైలు అధికారులు, ఎస్కార్ట్ సిబ్బంది ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆరిలోవ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులోనే వీరంగం..?

కేంద్రకారాగారం నుంచి వాయిదాకు వెళ్లే సమయంలో, కోర్టు వాయిదా అనంతరం మంచినీటి సీసాలో మద్యం కలిపి తాగినట్లు అనుమానిస్తున్నారు. కోర్టు వద్దే ఎస్కార్ట్ సిబ్బందిపై తిరగబడ్డాడు. నిబంధనల ప్రకారం కోర్టుకు తీసుకెళ్లినప్పటి నుంచి తిరిగి కేంద్రకారాగారానికి తీసుకొచ్చే వరకు ఖైదీకి బయట నుంచి ఎటువంటి ఆహారం గానీ, కనీసం ద్రవ పదార్థాలు కూడా అనుమతించకూడదు. ఏదైనా ఎస్కార్ట్ సిబ్బంది మాత్రమే ఇవ్వాలి. కోర్టు వద్దే మద్యం మత్తులో ఎస్కార్ట్ సిబ్బందిపైనా తిరగబడ్డాడు. దీంతో మానసికంగా బాధపడుతున్నాడని కెజిహెచ్‌కు తరలించారు. అక్కడా ఆసుపత్రి సిబ్బందిపైనా తిరగబడ్డాడు. అక్కడ నుంచి కేంద్రకారాగారానికి తీసుకొచ్చారు. ఇదంతా చూస్తే కోర్టు వాయిదా అనంతరం కోర్టు ఆవరణలోనే బంధువులు తెచ్చి ఇచ్చిన వాటర్ బాటిల్‌లో మద్యం వేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దానిని కప్పి పుచ్చుకునేందుకు ఎస్కార్ట్ సిబ్బంది తంటాలు పడుతున్నట్లు సమాచారం.

హెచ్‌ఐవిపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-ఆనందపురం: ఆనందపురం మండలం బోనిలో హెచ్‌ఐవి, ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యాన మంగళవారం 'మీకు తెలుసా' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లింక్ వర్కర్ స్కీమ్ సిఎల్‌డబ్ల్యు ఎం.జ్యోతి మాట్లాడుతూ, హెచ్‌ఐవి, లైంగికంగా సంక్రమించే అంటువ్యాధులపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు 2 నెలలు ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. హెచ్‌ఐవి, సుఖవ్యాధులు, ఎస్‌టిఐల గురించి పరిజ్ఞానం, హెచ్‌ఐవి వారి పట్ల వివక్ష తగ్గించేందుకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కృష్ణారావు, సిహెచ్ఒ జశ్వంత్, ఎఎన్ఎం బాజియా, అంగన్వాడీలు గౌతమి, లక్ష్మి, ఆశ, కనకరత్నం పాల్గొన్నారు.

నీటి వనరులను కాపాడుకోవాలి

ప్రజాశక్తి -భీమునిపట్నం : నీటి వనరులను కాపాడుకోవాలని జివిఎంసి ఒకటో జోన్ కమిషనర్ కె.కనకమహాలక్ష్మి ప్రజలకు సూచించారు. 'నీటి వనరుల పునరుజ్జీవనం' అంశంపై మంగళవారం జోనల్ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, చెరువులు, వాగులపై అక్రమ కట్టడాల వల్ల వర్షాలు, వరదలు వచ్చినప్పుడు ఇళ్లలోకి వరద నీరు వెళ్లి ఆస్తి, ప్రాణ నష్టం జరుగుతుందని తెలిపారు. ఈ సదస్సులో కార్పొరేటర్లు గాడు చిన్ని కుమారి లక్ష్మి, గంటా అప్పలకొండ, వివిఎంఆర్‌డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఫణిరాం, ప్రాజెక్ట్ అధికారి లక్ష్మి, యుసిడి ఎపిడి వై.సంతోష్‌కుమార్, స్థానికులు గంటా నూకరాజు, సిహెచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

గుడిలోవ దేవస్థానానికి విద్యుత్తు మరమ్మతులు చేపట్టరూ?

ప్రజాశక్తి-ఆనందపురం : ఆనందపురం మండలం గుడిలోవ దేవస్థానం విద్యుత్తు వైర్లు తెగి ఆలయానికి విద్యుత్తు లేక భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఆలయం కొండల నడుమ ఉండడంతో తెల్లవారుజామున కటిక చీకటిగా ఉంటుంది. అడవి జంతువులు ఉండే ఈ ప్రాంతంలో విద్యుత్ లేక భక్తులు భయాందోళన చెందుతున్నారు. తక్షణమే మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు .

విష జ్వరాల నివారణకు చర్యలు : ఎంపిపి

ప్రజాశక్తి -పద్మనాభం : విష జ్వరాల నివారణకు చర్యలు తీసుకోవాలని అధికారులకు పద్మనాభం ఎంపిపి కె.రాంబాబు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇటీవల కురిసిన వర్షాలకు మునుపెన్నడు లేని విధంగా వర్షపాతం నమోదైందని, అధికారులు అప్రమత్తంగా ఉండి గ్రామస్థాయిలో సమస్యలను గుర్తించి పరిష్కరించాలని ఆదేశించారు. గ్రామాల్లో 15 రోజులకొకసారి నీటి ట్యాంకులను శుభ్రం చేయిస్తున్నామని గ్రామ కార్యదర్శులు వివరించారు. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల కొన్ని గ్రామాల్లో పట్టపగలే వీధిలైట్లు వెలుగుతున్నాయని, ఆన్, ఆఫ్ చేయడానికి ఎటువంటి పరికరాలు లేవని, వాటిని సమకూర్చే ఏర్పాటుచేయాలని కోరారు. సేరికాండం, రెడ్డిపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరా సరిగా లేదని, బిల్లులు మాత్రం అధికంగా వస్తున్నాయని ఆ గ్రామ కార్యదర్శి వివరించారు. ప్రభుత్వ శాఖలకు సంబంధించి పాత భవనాలు ఉంటే వాటిని వెంటనే తొలగించాలని ఎంపిపి ఆదేశించారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి రాంబాబు

జడ్‌పిటిసి సభ్యులు ఎస్.గిరిబాబు మాట్లాడుతూ, విద్యుత్ సమస్య ఎక్కడో ఒక చోట ఉంటే దాని పరిష్కారం కోసం ఫీడర్ పరిధిలోని గ్రామాలన్నిటికీ ఆ శాఖ అధికారులు సరఫరా నిలుపుదల చేస్తున్నారని తెలిపారు. మండల వ్యవసాయాధికారి ఎంవి.చలం మాట్లాడుతూ, ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలో 98 ఎకరాల్లో వరి పంట నీట మునిగినట్లు తెలిపారు.

నేరాలు ఘోరాలు

టివిఎస్ ఎక్సెల్ చోరీ

ప్రజాశక్తి-ఆనందపురం: బంటుపల్లి వారి కల్లాలు పంచాయతీ మీసాల వారి కల్లాలకు చెందిన కోరాడ సీతారాం టివిఎస్ ఎక్సెల్ వాహన చోరీకి గురైనట్లు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. వేములవలసలో జియో జోయాస్ వాటర్ కంపెనీలో వాటర్‌బోయ్‌గా పనిచేస్తున్న సీతారాం సోమవారం ఉదయం 10 గంటలకు కంపెనీకి వెళ్లి సమీపంలో ఉన్న స్థలంలో బండి పెట్టి, కంపెనీ వాహనంపై వాటర్ క్యాన్లు తీసుకుని వైజాగ్ వెళ్లారు. తిరిగి సాయంత్రం ఏడు గంటలకు వచ్చి చూసేసరికి టివిఎస్ ఎక్సెల్ వాహనం కనబడలేదు. దీంతో స్థానిక పోలీసులకు సీతారాం ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు. ఏపీ 39 కెడి 7930 నెంబర్ వాహనం ఎక్కడైనా కనిపిస్తే 9642490727 నెంబర్‌కు గానీ, స్థానిక పోలీస్ స్టేషన్‌కుగానీ సమాచారం అందించాలని బాధితుడు కోరాడు.

దాడి చేసిన ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి -మధురవాడ : పోతిన మల్లయ్యపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి ఓ వ్యక్తిపై దాడి చేసి గాయపరిచిన ఇద్దరిని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిఐ జి.బాలకృష్ణ తెలిపారు. బక్కన్నపాలెం కె-2 కాలనీకి చెందిన పాండురెడ్డి, అతని స్నేహితుడు త్రినాథ్ మద్యం తాగి ఓ మహిళలను ఆటపట్టించారు. దీన్ని గమనించిన అదే కాలనీకి పి.ప్రసాద్ వారిని ప్రశ్నించాడు. దీంతో వారిద్దరూ ప్రసాద్‌పై బీరు బాటిల్‌తో దాడిచేసి గాయపరిచారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సిఐ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి -మధురవాడ : పోతిన మల్లయ్యపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి అప్పులు బాధ తాళలేక భవనంపై నుంచి దూకి మంగళవారం ఆత్మహత్యకు పాల్పడినట్లు సిఐ జి.బాలకృష్ణ తెలిపారు. సిఐ కథనం ప్రకారం... జివిఎంసి 5వ వార్డు పరిధి సాయిరాం కాలనీలో బి.అప్పారావురెడ్డి (62) నివాసం ఉంటూ అక్కడే ఓ ప్రయివేటు పాఠశాల నడుపుతున్నాడు. అతనికి స్థానికంగా అప్పులు ఉన్నాయి. మంగళవారం మధ్యాహ్నం తన బంధువులకు చెందిన బహుళ అంతస్తు భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సిఐ తెలిపారు.

జిఒ 85ను రద్దు చేయాలి

నల్లబ్యాడ్జీలతో వైద్యుల నిరసన

ప్రజాశక్తి- నక్కపల్లి: వైద్యుల సర్వీసు కోటాను 30 శాతం నుంచి 15శాతానికి తగ్గిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జిఒ 85 వ్యతిరేకిస్తూ మండలంలోని గొడిచెర్ల పిహెచ్‌సి వైద్యులు మంగళవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతూ విధులు చేపట్టారు.ప్రభుత్వం జారీ చేసిన జీవో పట్ల వైద్యులు సుశక్య ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తమ మూడేళ్ల సర్వీస్ కు అర్థం లేకుండా పోయిందని ,అకస్మాత్తుగా జీవోను మార్చడం అన్యాయమని ఆవేదన వెలిబుచ్చారు .జీవోను వ్యతిరేకిస్తూ డాక్టర్స్ అసోసియేషన్ పిలుపుమేరకు దశల వారి ఆందోళన చేపట్టనున్నట్లు వెల్లడించారు.ఇందులో భాగంగామంగళవారం మొదటి రోజు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టమన్నారు. 11, 12న వైద్యసేవలకు అంతరాయం లేకుండా నిరసన కొనసాగిస్తామని,13 నాటికి అత్యవసర మినహా అన్ని సేవలు నిలిపివేస్తామన్నారు. 15న చలో విజయవాడ, అప్పటికీ ప్రభుత్వం స్పందించకుంటే, 16 నుంచి పూర్తి స్థాయిలో నిరవధికదీక్ష చేపడతామని హెచ్చరించారు

గొలుగొండ : రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జిఒ85 రద్దు చేయాలంటూ కృష్ణదేవిపేట పిహెచ్‌సి వైద్యాధికారులు డాక్టర్ హరి ప్రవీణ్, గాయత్రి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ప్రభుత్వ వైద్యాధికారులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు.. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిఒ85తో క్లినిక్‌లో 15 శాతం నాన్ క్లినిక్‌లో పనిచేస్తున్న వారికి 30 శాతానికి కుదించడం అన్యాయమన్నారు. గతంలో నాన్ క్లినిల్‌లో పనిచేసేవారికి 50 శాతం, క్లినిక్‌లో పనిచేసేవారికి 30శాతం ఉండేదన్నారు కార్యక్రమంలో పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న కృష్ణదేవిపేట వైద్య సిబ్బంది

పతకాలు సాధించిన విద్యార్థులకు అభినందనలు

ప్రజాశక్తి-సీతమ్మధార : తిరుపతిలో ఆగస్టు 31 నుంచి ఈ నెల 1వ తేదీ వరకు చిత్తూరు జిల్లా తైక్వాండో అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పురుషుల, మహిళల తైక్వాండో ఛాంపియన్ షిప్ పోటీల్లో పతకాలు సాధించిన డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల విద్యార్థులను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ జి.మధుకుమార్ అభినందించారు. బిఎ ప్రథమ సంవత్సరం చదువుతున్న పి.సాయిలోహిత్ కుమార్ 54 కేజీల విభాగంలో బంగారు పతకాన్ని, బి.కాం ప్రథమ సంవత్సరం చదువుతున్న కె.భాగ్యరాజు 87 కేజీల విభాగంలో కాంస్య పతకాన్ని సాధించారని మధుకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జిఎస్‌కె చక్రవర్తి, వ్యాయామ విభాగాధిపతి డాక్టర్ వై.శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ బిఆర్ఎస్.లక్ష్మణరెడ్డి, అసిస్టెంట్ డీన్ మేజర్ టి.బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు.

బాక్సింగ్‌లో 16 మందికి స్వర్ణ పతకాలు

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలకు చెందిన 7, 8, 9, 10 తరగతులు, ఇంటర్, డిగ్రీ చదువుతున్న 17 మంది గ్రామీణ ప్రాంత విద్యార్థులు భారత్ బాక్సింగ్ ఫెడరేషన్ ఆధ్వర్యాన ఈ నెల 4 నుంచి 7వ తేదీ వరకు నేపాల్‌లో జరిగిన అంతర్జాతీయ కిక్ బాక్సింగ్ పోటీల్లో పాల్గొనగా 16 మంది స్వర్ణ పతకాలు, ఒకరు సిల్వర్ మెడల్ సాధించినట్లు మండలంలోని అన్న వరం గ్రామానికి చెందిన కోచ్ వాసుపల్లి ఆదినారాయణ తెలిపారు. వీరంతా జూనియర్, సబ్ జూనియర్ విభాగాల్లో కిక్ బాక్సింగ్ పోటీల్లో పతకాలు సాధించినట్లు పేర్కొన్నారు. స్వర్ణ, సిల్వర్ పతకాలు సాధించిన వీరంతా చిప్పాడ, సిటీనగర్, అన్నవరం, జీరుపాలెం, టి.నగరపాలెం, జివిఎంసి ఒకటో జోన్ తగరపువలస, భోగాపురం మండలం గుడివాడ గ్రామాలకు చెందిన వారే. గెలుపొందిన క్రీడాకారులను, కోచ్ ఆదినారాయణకు చిప్పాడ, దివీస్ సంస్థ డైరెక్టర్ దేవేందర్ రావు, జిఎంలు ఎల్వీ రమణ, వైఎస్ కోటేశ్వరరావు జ్ఞాపికలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో సిఎస్ఆర్ మేనేజర్ సురేష్‌కుమార్ పాల్గొన్నారు. నేపాల్ వెళ్లేందుకు ప్రయాణ ఖర్చుల నిమిత్తం ఒక్కో క్రీడాకారునికి తమ సంస్థ రూ.35 వేలు ఆర్థిక సాయం అందజేసినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు.

పిఎం సూర్యఘర్ యోజనపై అవగాహన

ప్రజాశక్తి -భీమునిపట్నం : ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకంపై ఎపిఇపిడిసిఎల్ జోన్-3 ఇఇ పోలాకి శ్రీనివాసరావు ఆధ్వర్యాన మంగళవారం గృహ విద్యుత్ వినియోగదారులకు అవగాహన కల్పించారు. స్థానిక శ్రీ వాసవి కళ్యాణ మండపంలో జరిగిన అవగాహన సదస్సులో ఇఇ శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఇంటిపై సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటువల్ల విద్యుత్ బిల్లు తగ్గించుకోవచ్చని చెప్పారు. రాయితీపై సోలార్ రూఫ్ టాప్ పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఇఇ ఆర్.రమేష్, భీమిలి, చిట్టివలస విద్యుత్ సబ్ స్టేషన్ ఎఇలు యు.సకరయ్య, బి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

డైట్‌లో ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినం

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ డైట్‌లో మంగళవారం ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినం నిర్వహించారు. ఈ సందర్భంగా డైట్ వైస్ ప్రిన్సిపల్ యు.మాణిక్యంనాయుడు, అధ్యాపకులు గొట్టేటి రవి మాట్లాడుతూ, ఒత్తిడికి గురవుతున్న వారిని గుర్తించి తగు రీతిన ప్రశ్నించడం, ఒప్పించడం, సూచనలను తెలపడం లాంటి త్రిసూత్ర పద్ధతులు అనుసరిస్తే సాధ్యమైనంత వరకు ఆత్మహత్యలను నివారించవచ్చని తెలిపారు. విలువైన జీవితాన్ని ముగించవద్దు, ఆత్మ హత్యలు పరిష్కారం చూపవు అన్న నినాదాలతో ఛాత్రోపాధ్యాయులు ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఎల్.సుధాకర్, జిబిఎస్.నాగేశ్వరరావు, సోమయాజులు, త్రినాథరావు, మహాలక్ష్మి, నీలిమ పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్‌లో గురుకుల విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఉమ్మడి విశాఖ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఈ నెల 8వ తేదీన గోపాలపట్నం జెడ్పి హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో జరిగిన 16 ఏళ్ల బాల బాలికల టోర్నమెంట్ ఎంపిక పోటీల్లో స్థానిక ఎపి బాలికల గురుకుల పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థిని ఎ.భువనశ్రీ జిల్లా జట్టుకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ జి.జయప్రకాష్, పిఇటి ఎం.మహాలక్ష్మి, బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ భీమిలి సెక్రటరీ ఎం.శంకరరావు తెలిపారు. ఈ నెల 13, 14, 15 తేదీల్లో తూర్పుగోదావరి జిల్లా అన్నవరంలో జరగనున్న బాల్ బ్యాడ్మింటన్ అంతర్ జిల్లాల టోర్నమెంట్‌లో విద్యార్థిని భువనశ్రీ పాల్గొనున్నట్లు పేర్కొన్నారు. ఈమెతో పాటు పిఇటి, కోచ్‌ను పాఠశాలలో ప్రిన్సిపల్ మంగళ వారం అభినందించారు.

కొండవాలు ప్రాంత వాసులను ఆదుకుంటాం

రాష్ట్ర హోంమంత్రి అనిత

ప్రజాశక్తి -యంత్రాంగం

గోపాలపట్నం : వర్షాలకు దెబ్బతిన్న కొండవాలు ప్రాంతంలోని ప్రజలను అన్ని విధాలా ఆదుకుంటామని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత చెప్పారు. గోపాలపట్నంలో కొండచరియలు విరిగిపడిన ప్రాంతాన్ని స్థానిక ఎమ్మెల్యే గణబాబుతో కలిసి ఆమె మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గోపాలపట్నంలో కొండచరియలు విరిగిపడిన వెంటనే అధికార యంత్రాంగాన్ని ప్రభుత్వం అప్రమత్తం చేసి, బాధిత కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించామని తెలిపారు. విశాఖలో కొండవాలు ప్రాంతాల్లో నివసించేవారి సంఖ్య ఎక్కువగా ఉందని, బాధితులకు శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. కొండచరియలు విరిగిపడిన ఘటనపై కమిటీ వేశామని తెలిపారు. అనంతరం పునావాస కేంద్రంలో నివసిస్తున్న ప్రజలను పరామర్శించారు. ప్రభుత్వ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెందుర్తి : జివిఎంసి 88వ వార్డు పరిధి నరవ, కోట నరవ కాలనీ ప్రాంతాలలో అధికారులతో కలిసి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కోట నరవ, గవర జగ్గయ్యపాలెం ప్రాంతాల మీదుగా వెళ్తున్న మేఘాద్రి గెడ్డ రిజర్వాయర్ కాలవల్లో పూడిక తీయకపోవడం వల్ల నివాస ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయని, తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పాడైన కల్వర్టులు, రోడ్డు పనులను త్వరితగతిన పూర్తిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్లు హైమావతి, సన్యాసి నాయుడు, 88వ వార్డు కార్పొరేటర్ మొల్లి ముత్యాలు, కూటమి నాయకులు, పాల్గొన్నారు.

అప్రమత్తం : గంటా

తగరపువలస : కొండవాలు ప్రాంతాలపై అప్రమత్తత అవసరం అని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సంబంధిత అధికారును ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో బండ రాళ్ళు విరిగి పడిన జివిఎంసి రెండో వార్డు సత్యనారాయణపేట కొండవాలు ప్రాంతంలో మంగళవారం అధికారులతో కలిసి ఎమ్మెల్యే పర్యటించారు. రాళ్ళు, మట్టి జారి పడే అవకాశం ఉన్నందున కొండ వాలు ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కొండవాలు ప్రాంతంలో ఉన్న 20 కుటుంబాలను ముందు జాగ్రత్త చర్యగా పునరావాస కేంద్రానికి తరలించినట్లు అధికారులు వివరించారు. కొండ వాలు ప్రజలకు సరిపడా తాగు నీరు అందించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



నిర్వాసితులను పరామర్శిస్తున్న హోం మంత్రి అనిత, ఎమ్మెల్యే గణబాబు

కోతకు గురైన తీర ప్రాంతం పరిశీలన..

ఇటీవల వర్షాల కారణంగా జివిఎంసి మూడో వార్డు బోయివీధి వద్ద కోతకు గురైన సముద్ర తీర ప్రాంతాన్ని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పరిశీలించారు. తీరం కోతకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని జివిఎంసి అధికారులను గంటా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ కె.కనకమహాలక్ష్మి, 2వ వార్డు కార్పొరేటర్ గాడు చిన్ని కుమారిలక్ష్మి, టిడిపి నాయకులు కొప్పల రమేష్, తమ్మిన సూరిబాబు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

షీలానగర్‌కు ముప్పు?



ఒక చోట పేరుకుపోయిన మురుగునీరు

ప్రజాశక్తి -గాజువాక : గెయిల్ పరిశ్రమలో కాలువల మరమ్మతులతో షీలానగర్ పరిసర ప్రజలు మరో ప్రమాదానికి గురయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. గత కొంతకాలంగా షీలానగర్, హరిజనజగ్గయ్య పాలెం, వెంకటేశ్వర కాలనీ, షీలానగర్ డెయిరీ హాస్పిటల్ నుంచి వచ్చే మురుగనీరు గెయిల్ లోపలి కాలువ ద్వారా వెళ్లి సముద్రంలో కలిసేది. ఇటీవల కాలువ మరమ్మతుల నిమిత్తం లోపలికి నీరు ప్రవహించకుండా ఆ మార్గాన్ని గెయిల్ యాజమాన్యం మూసివేసింది. దీంతో మురుగునీరు ప్రవహించక కాలవుల్లోనే నిల్వ చేరుతోంది. ఈ మధ్య కురిసిన వర్షానికి హరిజన జగ్గయ్యపాలెం, వెంకటేశ్వర కాలనీ, షీలానగర్, డెయిరీ హాస్పిటల్, అక్కిరెడ్డిపాలెం, నాతయ్యపాలెం నుంచి వచ్చే నీరు ప్రవహించక గెయిల్ ప్రక్కన ఉన్న షీలానగర్ పెట్రోల్ బంకు పక్కన ఉన్న పార్కింగ్ ప్రదేశంలో నిల్వ ఏర్పడింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్థానికులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

హయ్యర్ పెన్షన్ అమలుచేయాలి

ప్రజాశక్తి-ములగాడ : దరఖాస్తు చేసుకున్న వారందరికీ హయర్ పెన్షన్ అమలుచేయాలని పెన్షనర్ల సంఘం నాయకులు ఎస్‌కె.హుస్సేన్ కోరారు. పెన్షనర్ల సంఘం పారిశ్రామిక ప్రాంత ప్రాంతీయ సమావేశం మల్కాపురంలోని సిఐటియు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌కె.హుస్సేన్ మాట్లాడుతూ, 15 సంవత్సరాల నుంచి శాంతియుతంగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదని తెలిపారు. సమస్యపై ఢిల్లీలో ధర్నా చేసిన అనంతరం మంత్రి దృష్టికి తీసుకెళ్లామని, మూడు నెలల్లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి సమస్య పరిష్కారానికి ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. హయ్యర్ పెన్షన్ విషయమై 75 లక్షల మంది పెన్షనర్లలో కేవలం 17 లక్షల 48 వేల 775 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారని, 8,500 మందికి మాత్రమే ఇప్పటి వరకు హయ్యర్ పెన్షన్ అమలు చేశారని తెలిపారు. వీలైనంత తొందరగా దరఖాస్తు చేసుకున్న వారందరికీ అమలు పరచాలని కోరారు. మే నెల 29వ తేదీ నాటికి అందరికీ రూ.7500 హయ్యర్ పెన్షన్ వస్తుందని చెప్పినా అమలుకాలేదని తెలిపారు. స్టీల్‌ప్లాంట్ పెన్షనర్లు ఇప్పటివరకు రూ.600 కోట్లు జమచేసినప్పటికీ ఇంతవరకు వారికి ఎలాంటి సమాచారం అందించకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు.

ప్రభుత్వ సెలవులు పాటించాల్సిందే

ప్రజాశక్తి -గాజువాక : పిల్లల మనో వికాసానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, జిల్లా విద్యాశాఖ నిర్దేశించిన ప్రతినెలా రెండో శనివారం, ప్రతి ఆదివారంతోపాటు వివిధ పండగల సెలవులను ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఖచ్చితంగా పాటించాల్సిందేనని ఆంధ్రప్రదేశ్ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం స్పష్టంచేశారు. బాలల హక్కుల పరిరక్షణ కమిషన్, జిల్లా విద్యాశాఖ సంయుక్తంగా బాలల హక్కుల పరిరక్షణలో భాగంగా గాజువాక, పెదగంట్యాడ మండలాల ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు, ప్రిన్సిపళ్ల పాత్రపై మంగళవారం శ్రీనగర్‌లోని యాపిల్ పాఠశాలలో అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ, రాష్ట్రంలో అనేక యాజమాన్యాల ప్రైవేటు పాఠశాలల్లో బాలల హక్కుల ఉల్లంఘనలకు పాల్పడుతున్నట్లు కమిషన్‌కు ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. ముఖ్యంగా సెలవులు పాటించడంలో మీన మేషాలు లెక్కిస్తున్నందున విద్యార్థులు మానసికానందానికి దూరంగా ఉంటుండడాన్ని కమిషన్ సీరియస్‌గా తీసుకుంటున్నట్లు చెప్పారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ మాట్లాడుతూ, లైంగిక దాడులు నిర్మూలన, మంచి, చెడు స్పర్శలపై అవగాహన, ఆడపిల్లల ఋతుస్రావ సమయంలో ఒత్తిడి లేని విద్యను అందించే ఆరోగ్య సూత్రాలు అమలు, బాలల హక్కులు, చట్టాలపై అవగాహన దృష్టి సారిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ ఎంబసీ ఫౌండర్ ఉమారాజ్, సైకాలజిస్ట్ ఎం.వంశీ, క్లినికల్ సైకాలజిస్ట్ పార్వతి కశ్యప్, జిప్సా అధ్యక్షులు పాలవలస భాస్కరరావు, సర్వ శిక్ష అభియాన్ ఎపిసి శ్రీనివాస్, యాపిల్ పాఠశాల కరస్పాండెంట్ టి.బలరామకృష్ణ పాల్గొన్నారు.

జర్నలిస్టులకు సత్కారం

ప్రజాశక్తి-సీతమ్మధార : జాతీయ జర్నలిస్టుల దినోత్సవాన్ని పురస్కరించుకొని పలువురు జర్నలిస్టులను ఏపీ ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ చైర్మన్, ఉపకార్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ కంచర్ల అచ్యుతరావు సత్కరించారు. ఏపీ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యాన పౌర గ్రంథాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో అచ్యుతరావు మాట్లాడుతూ, నిరంతరం సమాజం కోసం పాటుపడే జర్నలిస్టులకు తన పరిధి మేరకు సహాయ, సహకారాల అందిస్తానని చెప్పారు. తాను తీసిన సినిమాల్లో వచ్చిన లాభాల్లో కొంత మొత్తాన్ని జర్నలిస్టుల సంక్షేమానికి కేటాయిస్తున్నట్లు చెప్పారు. జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో జర్నలిస్టులు సంక్షేమమే లక్ష్యంగా తమ యూనియన్లు పనిచేస్తున్నాయన్నారు. భవిష్యత్తులో అక్రిడిటేషన్, ఇళ్ల స్థలాలు, ప్రమాద బీమా వంటి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ విశాఖ అర్బన్ యూనిట్ అధ్యక్షులు పి.నారాయణ, ఏపీ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఇరోతి ఈశ్వరరావు, కార్యదర్శి మదన్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పల్లాకు జ్వరం

ప్రజాశక్తి -గాజువాక : తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు జ్వరంతో బాధపడుతున్నారు. నగరంలో వైద్యం నిమిత్తం హాస్పిటల్లో చేరారు. విజయవాడలో వరద ప్రభావిత ప్రాంతాల్లో తిరుగుతూ వర్షంలో తడవడం వల్ల జ్వరం బారిన పడినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. గాజువాక నుంచి నాయకులు, కార్యకర్తలు ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు.

వరద బాధితులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి 7వ వార్డు పరిధిలో ఉన్న స్వయం సహాయక సంఘాలు సభ్యులు అందరూ కలిసి విజయవాడ వరద బాధితుల సహాయ నిమిత్తం రూ.40 వేలు చెక్కును ఆర్‌పిలతో కలిసి తెలుగుదేశం రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి పిళ్లా వెంకటరావు, కార్పొరేటర్ మంగమ్మ ద్వారా సిఐకు మంగళవారం అందజేశారు. వీరిని వెంకటరావు అభినందించారు.

ధీర వనిత ఐలమ్మకు ఘన నివాళి

ప్రజాశక్తి-అనకాపల్లి

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ 39వ వర్ధంతిని స్థానిక సిఐటియు కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం ఐద్వా జిల్లా కార్యదర్శి డిడి వరలక్ష్మి, జాయింట్ సెక్రెటరీ జి.సుభాషిణి మాట్లాడుతూ చరిత్రలో నిలిచిన పోరాటాల్లో ఒక్కటైన తెలంగాణా సాయుధ పోరాటంలో వెట్టి చాకిరి నుంచి విముక్తి కోసం ఐలమ్మ చేసిన పోరాటం అందరిని కదిలించిందన్నారు. చాలా స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. పోరాట క్రమంలో ఆమె ఒక కొడుకును పోగొట్టుకొందని, మరో ఇద్దరు కొడుకులు, భర్త జైలుపాలైనా ఏమాత్రం వెనక్కి తగ్గకుండా పోరాటాన్ని కొనసాగించిందని తెలిపారు. ఆమె పోరాట స్ఫూర్తి మనం అలవర్చుకోవాలన్నారు. 1944 సంవత్సరం కాలంలో రైతులు పండించుకున్న పంటలను భూస్వాములు, గుండాలు దౌర్జన్యంగా కోసుకెళ్తుండగా అడ్డుపడి ఎదురునిలిచిన ధీర మహిళ ఐలమ్మ అని పేర్కొన్నారు. అత్యంత క్రూరమైన వెట్టి చాకిరి, అఘాయిత్యాలు, ఎదురుతిరిగితే చంపేసే ఆ రోజులలో ఆమె ఘళమెత్తిందని, అదే స్ఫూర్తితో ఎంతో మంది పోరాటానికి ముందుకు వచ్చారని పేర్కొన్నారు. ఐలమ్మ అనగానే అణగారిన వర్గాల కోసం పోరాడిన తీరు తరతరాలకు గుర్తుండిపోతుందన్నారు. సాయుధ పోరాటం అనంతరం 10 లక్షల ఎకరాలు పైగా భూమిని పేద ప్రజల కోసం పంపిణీ చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జాయింట్ సెక్రెటరీ బి.వాణి, భాగ్య తదితరులు పాల్గొన్నారు.

కశింకోట : కశింకోటలో ఐలమ్మ 39వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఐద్వా ఆధ్వర్యాన మంగళవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి డి.డి.వరలక్ష్మి మాట్లాడారు. ముందుగా ఆమె చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు బి. సూర్యలక్ష్మి, వి.సత్యవతి, బి.అచ్చియమ్మ, నూకాలమ్మ, వి నూకరత్నం, కే.పూర్ణమ్మ, డి.మహాలక్ష్మి, ఎం.రమ్య తదితరులు పాల్గొన్నారు.



ఐలమ్మ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఐద్వా నేతలు, మహిళలు



ఈ-క్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

గ్రామాల్లో ఇ-క్రాప్ నమోదు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలో పలు గ్రామాల్లో ఖరీఫ్ సీజన్లో రైతులు వేసిన వరి, చెరకు తదితర పంటలకు మంగళవారం ఈ క్రాప్ నమోదు చేశారు. మండలంలోని వడ్డాది, చిన్నప్పన్నపాలెం, దిబ్బిడి తదితర గ్రామాల్లో వివరాలు నమోదు చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు పలు గ్రామాల్లో రైతుల వరి నాట్లను పూర్తి చేశారు.

పారిశుధ్యానికి ప్రాధాన్యతనివ్వాలి

ప్రజాశక్తి-కె.కోటపాడు : గ్రామాల్లో పారిశుధ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి సబ్బి అప్పలరాజు అన్నారు. మంగళవారం ఆయన స్థానిక బజారు సంత ప్రాంతాల్లో మాంసం, చేపల దుకాణాలను పరిశీలించారు. వర్షాకాలంలో దుకాణాల్లోని చెత్త, వ్యర్థాలను డబ్బాల్లో వేయాలని కోరారు. రోడ్డపై చెత్త వేయరాదని, పరిశుభ్రత పాటించాలని, పరిశుభ్రత పాటించని వారిపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వి ప్రసాద్ ఇతర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎడ్ల పరుగు పోటీలు

ప్రజాశక్తి-దేవరాపల్లి : దేవరపల్లి మండల కేంద్రంలో వినాయక మహోత్సవం సందర్భంగా మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కర్‌రావు ఆధ్వర్యంలో మంగళవారం ఎడ్ల పరుగు పోటీలు నేరెళ్లవారి కళల్లో నిర్వహించారు. ఈ పోటీల్లో 11 బళ్ళు పాల్గొనగా, మొదటి బహుమతిని శ్రీఆంజనేయం కేజే.పురం వారి బండి, రెండో బహుమతిగా ఎం శివతేజ నరసయ్యపేట వారి బండి గెలుచుకున్నాయి. విజేతలకు నగదు బహుమతులను మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి, లెక్కల సత్యనారాయణ, నేరళ్లవారి కళలు గ్రామ పెద్దల చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

పంట పొలాల పరిశీలన

ప్రజాశక్తి-రాంబిల్లి : మండలంలోని జెడ్ చింతువ శివారు లోవపాలెం, లాలం కోడూరు గ్రామాల్లో వర్షాలకు నీట మునిగిన పంట పొలాలను టిడిపి, జనసేన మండల నాయకులు దినబాబు, పప్పల నూకన్న దొర మంగళవారం పరిశీలించారు. కార్యక్రమంలో ఆ పార్టీల నాయకులు మెరుగు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జెడ్‌పి మాజీ వైస్ చైర్మన్ తుంపాల ప్రథమ వర్ధంతి

ప్రజాశక్తి-సబ్బవరం

జిల్లా పరిషత్తు మాజీ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు ప్రథమ వర్ధంతి మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ ముఖ్య అతిథిగా హాజరై తుంపాల విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తుంపాల అప్పారావు రాజకీయంగా చేసిన సేవలను కొనియాడారు. అంతకు ముందు మాజీ ఎమ్మెల్యే, మండల వైసిపి నేతలు తుంపాల స్వగ్రామం వెళ్లి తుంపాల చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నేతలు గండి రవికుమార్, బోకం రాము నాయుడు, సబ్బవరపు నారాయణ మూర్తి, మోపాడ అప్పారావు, యడ్ల నాయుడు, ఉగ్గిన గంగు నాయుడు, బండారు శ్రీనివాసరావు, బోను గంగు నాయుడు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ లు తదితరులు పాల్గొన్నారు.



అప్పారావు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే, నేతలు

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి-కె.కోటపాడు

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని మహిళా శిశు అభివృద్ధి పథకం సిడిపిఒ మంగతాయారు కోరారు. మంగళవారం కే.కోటపాడు మండల కేంద్రంలోని 1,2,3 అంగన్వాడీ కేంద్రాలల్లో పౌష్టికాహార మహోత్సవాల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. అర్హులు అందరూ అంగ్వాడీ కేంద్రాల్లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కొత్త నేర చట్టంపై అవగాహన కల్పించారు. మహిళలకు పనిచేసే చోట రక్షణ కల్పించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. అనంతరం మహిళలకు పోషకాహారాన్ని అందించారు. ఎంపీటీసీ సభ్యురాలు బంగారి లక్ష్మి, సూపర్వైజర్ ఎల్సీ సుశీల, మహిళా పోలీస్ శ్రీదేవి, అంగన్వాడీ కార్యకర్తలు దొకల కుమారి, భూపతి లక్ష్మి, గాలి గౌతమి, పలువురు గర్భవతులు, బాలింతలు, బాల బాలికలు పాల్గొన్నారు.

ప్రభుత్వంపై బురదజల్లడం సరికాదు

ప్రజాశక్తి -అనకాపల్లి : మాజీ సీఎం జగన్ రెడ్డి, మాజీమంత్రి గుడివాడ అమర్నాథ్ కూటమి ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నాన్ని విరమించుకోవాలని మాజీ శాసనమండలి సభ్యులు బుద్ధ నాగ జగదీశ్వరరావు హితవుపలికారు. స్థానిక విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడుతూ బుడమేరు వాగు గట్లపై ఉన్న మట్టిని రూ.500 కోట్లకు అమ్ముకోవడం, వైసిపి మంత్రులు ఎమ్మెల్యేలు కాలువను ఏడు కిలోమీటర్లు ఆక్రమించుకోవడం వల్ల విజయవాడలో వరదలు రావడానికి కారణమని ఆరోపించారు. వరదలు వచ్చి ఎనిమిది రోజులు కావస్తున్నా బాధితుల పట్ల సానుభూతి గాని, సహాయం గాని, పసిపిల్లలకు చిన్న పాల ప్యాకెట్ను కూడా అందించలేని అమర్నాథ్‌కు మాట్లాడే నైతిక హక్కులేదన్నారు. తెలుగుదేశం పార్టీ శ్రేణులు, నిరంతరం బాధితులకు సహాయ సహకారాలు అందిస్తున్నారని, అనేకమంది దాతలు ముందుకు వచ్చి భూరి విరాళాలు ప్రకటించిన విషయాన్ని జీర్ణించుకోలేకపోతున్నారని పేర్కొన్నారు.

మెరిట్ విద్యార్థి శృతికి సన్మానం

ప్రజాశక్తి-దేవరాపల్లి

మండలంలోని రైవాడ గ్రామానికి చెందిన తాపీ మేస్త్రి దుక్క ఈశ్వరరావు కుమార్తె శృతి దేవరాపల్లి హైస్కూల్లో చదువుతూ ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో 561 మార్కులు సాధించింది. అధిక మార్కులు సాధించిన విద్యార్థులను యాదవ్ సంఘం ఆధ్వర్యంలో అనకాపల్లి లక్ష్మీ గ్రాండ్ ఫంక్షన్ హాల్లో అనకాపల్లి జిల్లా స్థాయిలో అభినందనసభ నిర్వహించారు. ఈ సభలో శృతిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి పార్లమెంట్ టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు చల్లా నానాజీ పాల్గొన్నారు.



శృతిని సత్కరిస్తున్న నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ్‌కృష్ణన్, చిత్రంలో జెసి జాహ్నవి తదితరులు

క్రీడలతో మానసిక ఉల్లాసం

జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్

ప్రజాశక్తి-అనకాపల్లి

క్రీడలతో మానసిక ఉల్లాసం పొందవచ్చని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం కలెక్టర్ అధ్యక్షతన జిల్లా క్రీడల అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని స్పోర్ట్స్ ప్రాజెక్ట్‌లపై సమీక్షించారు. నక్కపల్లిలో హాకీ మినీ గ్రౌండ్ ఏర్పాటు, పరవాడలో క్రికెట్ గ్రౌండ్ కాంపౌండ్ వాల్ నిర్మాణం, వి.మాడుగులలో 200 మీటర్ల ట్రాక్ నిర్మాణం, వాలీబాల్, బ్యాడ్మింటన్ గ్రౌండ్స్ పనులు, చోడవరంలో వాలీబాల్ కోర్టు పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. పనులను త్వరితగతిన పూర్తి చేయించాలని కమిటీ సభ్యులను ఆదేశించారు. రాంబిల్లి, అచ్యుతాపురం హైస్కూల్లో ప్లే ఫీల్డ్ డెవలప్మెంట్ పనులపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం. జాహ్నవి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జిల్లా టెన్నికాయిట్ జట్లు ఎంపిక



ఎంపిక పోటీలను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్

ప్రజాశక్తి-పరవాడ

ఉమ్మడి విశాఖపట్నం జిల్లా టెన్నికాయిట్ సబ్ జూనియర్ బాల బాలికల జట్లు ఎంపిక మంగళవారం మండలంలోని లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ ఎంపిక కార్యక్రమాన్ని టెన్నికాయిట్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు, జీవీఎంసీ కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఓటమికి తలవంచకుండా విజయం సాధించడానికి కృషి చేయాలన్నారు. జాతీయ టెన్నికాయిట్ సమైక్య టెక్నికల్ కమిటీ చైర్మన్ కెవిఎవి సత్యనారాయణ మాట్లాడుతూ ఎంపికైన క్రీడాకారులు ఈనెల 14 నుండి 16వ తేదీ వరకు శ్రీకాకుళం జిల్లాలోని వజ్రపుకొత్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగే రాష్ట్ర పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. అక్కడ ప్రతిభ కనబరిచి రాష్ట్ర పోటీలలో మొదటి ఆరు స్థానాలు సాధించిన క్రీడాకారులు సెప్టెంబర్ 30 నుండి అక్టోబర్ 4వ తేదీ వరకు జమ్మూకాశ్మీర్ రాష్ట్రంలో జరిగే 37వ జాతీయ సబ్ జూనియర్ టెన్నికాయిట్ పోటీలలో పాల్గొంటారని చెప్పారు. అనంతరం బాక్సింగ్ క్రీడాకారులకు శిక్షణ కొరకు క్రీడా సామగ్రిని బాక్సింగ్ కోచ్ రెహమాన్ ఆధ్వర్యంలో అందించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి జి కనకారావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి జి రాజు, ఉపాధ్యక్షులు ఎంవి నాగేశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయులు జె వివేకానంద, అంతర్జాతీయ టెన్నికాయిట్ క్రీడాకారిణి కె.నారాయణమ్మ, రెహమాన్, నాగరాజు, నూకరాజు, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయిని రాణి పాల్గొన్నారు.



కె.కోటపాడులో నిరసన తెలుపుతున్న స్టాఫ్ నర్సులు

జిఒ 115ను రద్దు చేయాలి

ఒప్పంద స్టాఫ్ నర్స్‌ల నిరసన

ప్రజాశక్తి-కె.కోటపాడు

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఏఎన్‌ఎమ్‌లను స్టాఫ్ నర్స్ పోస్టుల సర్దుబాటు కోసం ఇచ్చిన జీవో నెంబర్ 115 ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం స్థానిక యాబై పడకల ఆసుపత్రిలో పనిచేస్తున్న స్టాఫ్ నర్సులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు కె.అప్పలనరస మాట్లాడుతూ ఏపీ ప్రభుత్వం ఈనెల నాల్గవ తేదీన 115 జీవోను విడుదల చేసిందన్నారు. గత 15 ఏళ్లుగా ఒప్పంద పద్ధతిలోనే నియామకాలు జరుగుతున్నాయని అన్నారు. పదేళ్ల నుంచి రెగ్యులర్ నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదని అన్నారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీలక్ష్మీ వీరంతా వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ నర్సులు నాగమణి, రేవతి, పుష్పకళ, పార్వతి, సంధ్య తదితరులు పాల్గొన్నారు.


విశాఖ కలెక్టరేట్ : ఎఎన్ఎంలకు స్టాఫ్ నర్సులుగా పోస్టింగ్ ఇస్తూ బుధవారం నిర్వహించే కౌన్సిలింగ్‌ను నిలిపి వేయాలని, లేకుంటే తమ నిరసనలను ఉధృతం చేస్తామని నర్సుల స్ట్రగుల్ కమిటీ రాష్ట్ర కో - ఆర్డినేటర్ జి.కోటేశ్వరరావు హెచ్చరించారు. కాంట్రాక్ట్ నర్సులను రెగ్యులర్ చేయాలని చేపట్టిన నిరసన కెజిహెచ్‌లో మంగళవారానికి ఐదో రోజుకు చేరింది. క్లాక్ టవర్ వద్ద కాంట్రాక్ట్ నర్సులు నిరసన తెలియజేశారు. జిఒ 115ను రదు చేయాలని పెద్ద పెట్టున నినదించారు. కార్యక్రమంలో సంఘం కో-ఆర్డినేటర్ సి. సత్యనారాయణ, నాయకులు బి.శాంతికుమారి, కె. సూర్యకళ, వినీల పాల్గొన్నారు.

దిబ్బిడిలో అన్నసమారాధన

ప్రజాశక్తి-బుచ్చెయ్యపేట : మండలంలో దిబ్బిడిలో దుర్గాదేవి ప్రథమ వార్షికోత్సవ సందర్భంగా మంగళవారం అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

జర్నలిస్టు ఫెడరేషన్ కార్యవర్గం ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-అనకాపల్లి : ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ అనకాపల్లి పట్టణ శాఖ నూతన కార్యవర్గం మంగళవారం ప్రమాణ స్వీకారం చేసింది. స్థానిక వివేకానంద ఛారిటబుల్ ట్రస్ట్ హాల్లో నిర్వహించిన ఈ సమావేశానికి జిల్లా కార్యదర్శి ఈశ్వరరావు, అధ్యక్షులు భీమరశెట్టి వెంకటేష్, కోశాధికారి షేక్ బాషా, పూర్వపు అధ్యక్షులు మార్టూరు అజయ్ తదితరులు అధ్యక్షత వహించారు. అనకాపల్లి పట్టణ శాఖ అధ్యక్షునిగా శశి కుమార్, కార్యదర్శిగా పొలిమేర నాగ శ్రీనివాసరావు, గౌరవ అధ్యక్షునిగా తిమ్మాపాత్రుని రమేష్, కోశాధికారిగా మొల్లేటి గంగాధర్, ఉపాధ్యక్షులుగా కాంగ్రేగుల సతీష్‌తో పాటు సురేష్, భోగలింగం, సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వెంకటేష్, ఈశ్వరరావు మాట్లాడుతూ నూతన పాలకవర్గం పారదర్శకంగా పనిచేయాలని హితవు పలికారు. నూతన కార్యవర్గానికి పూలమాలవేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు మోహన్, గణేష్, రాజా, గంటా శ్రీనివాసరావు, శేఖర్, గోపాల్, రామకష్ణ, తదితరులు పాల్గొన్నారు.



నూతన కార్యవర్గం

విద్యాభివృద్ధే లక్ష్యంగా పని చేయాలి

ఆర్‌జెడి విజయ్‌భాస్కర్

ప్రజాశక్తి-కశింకోట

విద్యాభివృద్ధే లక్ష్యంగా విద్యాశాఖ అధికారులు పని చేయాలని ఆర్‌జెడి విజయ్‌భాస్కర్ అన్నారు. మండలంలోని సెయింట్ జాన్స్ ఉన్నత పాఠశాలలో అనకాపల్లి జిల్లా మండల విద్యాశాఖ అధికారులు 1, 2లు అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో విశాఖపట్నం జోన్-1 సంయుక్త ప్రాంతీయ సంచాలకులు విజయ్‌భాస్కర్ మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమిషనర్ స్థాయి అధికారులు పాఠశాలలోని సందర్శించినప్పుడు ఒక పాఠశాలకు, మండలానికి, జిల్లాకి సంబంధించి సమర్పించవలసిన వివరాలతో కూడిన ఫార్మేట్‌ను వివరించారు. ఉపాధ్యాయుల పని సర్దుబాటుకు సంబంధించి ఎట్టి పరిస్థితుల్లోనూ ఏరకమైన ఒత్తిళ్ళకు లోనవకుండా, ఏ సర్ఫలస్ ఉపాధ్యాయులనైతే డెఫిషిట్ పాఠశాలలకు ట్యాగ్ చేసారో వారందరూ ఖచ్చితంగా తమతమ నూతన పాఠశాలలో చేరే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ క్రమంలో సర్దుబాటు చేసిన ఉపాధ్యాయుల బయోమెట్రిక్ అటెండెన్స్‌ను ట్యాగ్ చేసిన పాఠశాలలకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ వారు బదలీ చేయడం జరిగిందని తెలిపారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను ప్రణాళిక బద్ధంగా అమలు చేయాలన్నారు. పాఠశాల కాంప్లెక్స్ కేంద్రాల వ్యవస్థీకరణ నిబంధనలకనుగుణంగా చేయాలని సూచించారు. సదరు కాంప్లెక్స్ పాఠశాలలో ఖచ్చితంగా ఓపెన్ జాగా వుండాలని, డిజిటల్ పరికరాలు, అన్ని సౌకర్యాలతో తరగతి గదులు వుండేలా మండలానికి 4 నుంచి 5 కాంప్లెక్స్ కేంద్రాలు మాత్రమే ఉండేలా పునర్వ్యవస్థీకరణ చేయాలని కోరారు. యుడైస్ ప్లస్ 2024-25 డాటా క్యాప్చర్ ఫార్మేట్‌లో పాఠశాల యాజమాన్య, కేటగిరి, దిగువ మరియు ఎగువ తరగతుల సరైన సమాచారం ఖచ్చితంగా నింపాలని, విద్యార్థుల పుట్టిన తేదీలు వారి పేర్లు, తల్లిదండ్రుల పేర్లు, ఆధార్ నెంబర్లు ఖచ్చితంగా సరైనవి నమోదు చేయాలని కోరారు. సమావేశంలో డిఇఒ ఎం.వెంకటలక్ష్మమ్మ, డిప్యూటీ డిఇఒ అప్పారావు, కశింకోట ఎంఇఒలు సురేష్, సూర్యనారాయణ మూర్తి, జిల్లా విద్యాశాఖ కార్యాలయ ఎఎస్ఒ, ఎపిఒ, సమగ్ర శిక్షా సెక్టోరల్ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్‌జెడి విజయ్‌భాస్కర్

పంటల రక్షణకు సూచనలు



రైతులకు సూచనలు చేస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

ప్రజాశక్తి-సబ్బవరం

వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో పంట నష్టం అంచనా వేయడానికి పలువురు శాస్త్రవేత్తలు మంగళవారం పంట పొలాలను పరిశీలించారు. అనకాపల్లి ఆర్ఎఆర్ఎస్ శాస్త్రవేత్తలు డాక్టర్ ఆర్.సరిత, డాక్టర్ వి.గౌరీలు స్థానిక వ్యవసాయ అధికారులతో కలిసి రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు. వర్షాల కారణంగా నీట మునిగిన పంట పొలాల్లో నీటిని తక్షణం తొలగించాలన్నారు. అనంతరం ఎకరాకు 20 కిలోల యూరియా, 20 కిలోల న్యూ రేట్ ఆఫ్ పొటాష్‌లను పై పాటుగా వేసుకోవడం వల్ల పంట త్వరగా పుంజుకోవడానికి అవకాశం ఉందని సూచించారు. ఇటువంటి పరిస్థితుల్లో తెగుళ్ళ నివారణకు 2 గ్రాముల కార్బండిజం, మంకోజెబ్, శిలీంద్ర మందును పిచికారి చేసుకోవడం వల్ల తెగుళ్లను అరికట్టుకోవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పోతల సత్యనారాయణ, గ్రామ వ్యవసాయ సహాయకులు బొబ్బరి లావణ్య, మాజీ సర్పంచ్ బోకం అప్పలనాయుడు, రైతులు జగ్గారావు, రమణ, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వినాయక అనుపు మహోత్సవం

ప్రజాశక్తి-పరవాడ

: మండలంలోని రావాడ గ్రామపంచాయతీ శివారు శృంగారపాడు గ్రామంలో శ్రీసిద్ధి వినాయక యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీసిద్ధి వినాయక అనుపు మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. టిడిపి మండల అధ్యక్షులు వియ్యపు చిన్నా పూజలు నిర్వహించారు. అన్న సమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సారిపల్లి జోగినాయుడు, వియ్యపు లక్ష్మి, పంచాయతీ సెక్రటరీ అనురాధ, మరిసా అప్పలరాజు, కారుకొండ కొండయ్య, మొల్లి గంగాధర్, మోటూరి హరిబాబు, పైల లక్ష్మి, దాసరి వెంకటరమణ, రేఖ రామారావు, మోటూరు కాశీ, షేక్ మదీనా తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఆసుపత్రి కార్మికులు

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె తప్పదు

ప్రజాశక్తి-అనకాపల్లి

ఆసుపత్రుల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోకుంటే సమ్మె తప్పదని ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ స్పష్టం చేశారు. ఆ సంఘం ఆధ్వర్యంలో 10 రోజులుగా ఎన్‌టిఆర్ ఆసుపత్రి వద్ద జరుగుతున్న నిరసన కార్యక్రమంలో మంగళవారం ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న కార్మికులకు ప్రతి నెల సక్రమంగా జీతాలు ఇవ్వడంలేదని ఆయన మండిపడ్డారు. కార్మికులందరికీ ఈ నెల 15వ తేదీలోగా బకాయి పడ్డ అన్ని నెలల జీతాలు చెల్లించాలని, జీఓల ప్రకారం జీతాలు పెంచాలని, 2021 జూన్ నెల నుండి రావాల్సిన వేతనానికి తగిన పిఎఫ్ డబ్బులు మొత్తం లెక్కలు చెప్పు జమ చేయాలని డిమాండ్ చేశారు. ఇఎస్ఐ కార్డులు ఇవ్వకుండా ప్రతి నెల ఇఎస్ఐ పేరుతో వేతనంలో కట్ చేసుకున్న డబ్బులు మొత్తం తిరిగి కార్మికులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేకుంటే 15వ తేదీ తరువాత నుంచి విధులు బహిష్కరణ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్.సంతోష్, అడ్డా ప్రసాద్, నూకరాజు, వెంకటలక్ష్మి, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల నిరసనకు స్పందించిన అధికారులు

మెటల్ రోడ్డు ఏర్పాటుకు సర్వే

ప్రజాశక్తి-దేవరాపల్లి

మండలంలోని చింతలపూడి పంచాయతీ, వీరభద్రపేట గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరుతూ గిరిజనులు ఆదివారం బురదలో కూర్చుని నిరసన తెలపగా, అధికారులు స్పందించారు. మంగళవారం పంచాయతీ కార్యదర్శి, ఇంజనీరింగ్ అసిస్టెంటు, ఉపాధి హామీ పథకం విఆర్‌పి తదితరులు మెటల్ రోడ్డు ఏర్పాటుకు సర్వే చేసి ఎస్టిమేట్ వేశారు. నాలుగు కల్వర్టులతో 900 మీటర్ల రోడ్డుకు ప్రతిపాదనలు తయారు చేసి పంపించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు డి వెంకన్న మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా గిరిజనులు ఆందోళన చేయడం, అధికారులు ఇస్టమేట్ వేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించడం పరిపాటుగా మారిందన్నారు. తాత్కాలికంగా గిరిజనులు ఆందోళనను చల్లర్చడం కోసం అధికారులు ఇలా చేయడం సరికాదన్నారు. పాలకులు ఎన్నికలప్పుడు ఓట్లు దండు కోవడం తప్ప సమస్య పరిష్కారం కోసం కృషి చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పుడైనా అధికారులు రాజకీయ నాయకులు చిత్తశుద్ధితో కృషి చేసి వెంటనే గిరిజనులకు రోడ్డు సౌకర్యం కల్పించాలని వెంకన్న డిమాండ్ చేశారు.



సర్వే చేస్తున్న ప్రభుత్వ సిబ్బంది

అల్పపీడనమొస్తే అన్నదాతల్లో ఆందోళనే..!

- ముంచెత్తుతున్న వర్షం, వరదనీరు
- ముంపుబారిన వందల ఎకరాల్లో పైర్లు
- ఏటా ఇదే పరిస్థితి..కానరాని పరిష్కారం

ప్రజాశక్తి- నక్కపల్లి : మండలంలోని ఉద్దండపురం, గొడిచెర్ల రెవెన్యూ పరిధిలో వరి పొలాలకు వరదలు వచ్చినప్పుడల్లా ముంపు బెడద తప్పలేదు. ఆవనీరు ,ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన వరద నీరు ఏకమై పంట పొలాలను ముంచెత్తుతున్నాయి. దీంతో వరదలు వస్తే అన్నదాత గుండెల్లో గుబులు రేపుతుంది. ఇటీవలా కురిసిన వర్షాలకు పాయకరావుపేట ప్రాంతం నుంచి వచ్చే ఆవ వరద నీటితోపాటు , మండలంలోని మెరక గ్రామాల నుంచి వచ్చే వరద నీరు ఏకం కావడంతో ఉద్దండ పురం, గొడిచెర్ల రెవెన్యూ పరిధిలో సుమారుగా 4 వందలఎకరాల వరి పొలాలు ముంపునకు గురయ్యాయి. ప్రతిసారి వరదలు వచ్చినప్పుడల్లా ఇదే పరిస్థితి కొనసాగుతుంది .ఆవ కాలువ పూర్తిగా సరి చేయకపోవడం , గోపాలపట్నం వద్ద ఆవ చెరువు నీటి ప్రవాహం తక్కువగా బయటకు వెళ్లడం వలన వరద నీటి ప్రవాహ ఉధృతికి ు వరి పొలాలన్నీ ముంపునకు గురవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఆవ నీటి ప్రవాహంతో పొలాలు ముంపునకు గురికాకుండా, వరద నీరు బయటకు పోయే విధంగా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు .అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి సాగు చేస్తున్నామని ,పంట నీట మునగడంతో అప్పుల పాలు అవుతున్నామని రైతులు ఆవేదన చెందుతున్నారు.పంట పొలాలు ముంపునకు గురికాకుండా శాశ్వత పరిష్కారం చేపట్టాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

వరద నీటి ప్రవాహానికి గునుపూడి,గుల్లిపాడు లో కూడా పంట పొలాలు నీట మునిగాయి. మండలంలో 4500 ఎకరాలు సాధారణ విస్తీర్ణం. వరి సాగు పూర్తిగా వర్షాధారంపై ఆధారపడి ఉంది .ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ఆరంభం నుంచే రైతులకు పెట్టుబడుల భారం ఎక్కువైంది. వర్షాలు సకాలంలో కురవకపోవడంతో ఇంజన్ల సహాయంతో తడులు పెట్టి వరి నాట్లు వేసారు. ఆగస్టు నెలాఖరు వరకు రైతులు వరి నాట్లు కొనసాగిస్తూనే ఉన్నారు .రైతులు ఎంతో వ్యయ ప్రయాసాలకు ఓర్చి పంట సాగు చేస్తున్నారు. అధిక



వరద నీటితో ముంపులో వరి పొలం

పెట్టుబడులు అయినప్పటికీ ఏదో రకంగా వరి పండించాలన్న లక్ష్యంతో అన్నదాత ముందుకు వెళ్తున్నా కాలం కలిసి రావడం లేదు .దీంతో అన్నదాతలు దిగులు చెందుతున్నారు.

రోలుగుంట : నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు, గెడ్డలు, వాగులు, వంకలు పొంగి నీటి ప్రవాహం ఎక్కువ అవడంతో కొవ్వూరు పోతలవానిచెరువు ఆయకట్టు కింద పొలాలు, అలాగే కొమరవోలు ఎగువ భాగాన పొలాలు ముంపునకు గురికావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది ముందుగా కురిసిన వర్షాలకు వరినాట్లు వేశారు. ఏపుగా వస్తున్న పొలాలను చూసి రైతులు ఆనందం వ్యక్తం చేసే సమయంలో, వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలో అనేక ప్రాంతాలలో వరిపైర్లు ముంపునకు గురయ్యాయి. రోజుల తరబడి నీటి ముంపులోనే వరిపైర్లు ఉండడంతో కుళ్లి పాడైపోతాయని రైతులు ఆవేదన చెందుతున్నారు.

శాశ్వత పరిష్కారం చేపట్టాలి



వర్షాలు, వరదనీటి ఉధృతికి మూడున్నర ఎకరాల వరిచేను నీటి మునిగింది .వరదలు వచ్చినప్పుడల్లా ఆవ నీరు,మెరక గ్రామాల నుంచి వచ్చే ఏకమై పంట పొలాలను ముంచెత్తుతున్నాయి. ఈ.ఏడాది వర్షాలు సక్రమంగా కురకపోవడంతో ఇంజన్లలో తడులు పెట్టి వరి నాట్లు వేసాం.సుమారుగా రూ.60 వేల వరకు పెట్టుబడులు పెట్టాను.పంట పొలాలు నీటి ముంపునకు గురికాకుండా శాశ్వత పరిష్కారం చేపట్టాలి.

-మాదిరెడ్డి సత్యనారాయణ, రైతు ,గొడిచెర్ల చేరి కొత్తూరు

కారిడార్ పనులను అడ్డుకుంటే చర్యలు

ప్రజాశక్తి -నక్కపల్లి: వైజాగ్, చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం ఎపిఐఐసి సేకరించిన భూముల్లో పనులు అడ్డగిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ అంబేద్కర్ అన్నారు . మండలంలోనిచందనాడ, వేంపాడు, రాజయ్యపేట, బుచ్చిరాజుపేట, దోనివాని లక్ష్మీపురం రెవిన్యూ గ్రామాల పరిధిలో పారిశ్రామిక వాడల నిర్మాణం కొరకు ఎపిఐఐసి అధికారులు రెవిన్యూ ద్వారా భూములను సేకరించి వాటికీ పూర్తీ పరిహారం చెల్లించడం జరిగిందని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సేకరించిన భూముల్లో జిల్లా కలెక్టర్ అనుమతితో కాంట్రాక్ట్ పొందిన సంస్థ ప్రారంభ దశ పనులు చేపడుతోందని, ఆ పనులకు గానీ, మెషినరీని గానీ ఎవరైనా అడ్డుకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు .

ఇళ్ల నష్టంపై ఉన్నతాధికారులకు నివేదిక

ప్రజాశక్తి -కోటవురట్ల : ఇటీవల కురిసిన వర్షాలకు మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో ఇల్లు దెబ్బతిన్నాయని, నష్టపోయినఇళ్లను గుర్తించామని తాహసిల్దార్ జానకమ్మ తెలిపారు, జిల్లా అధికారులకు నివేదిక అందజేస్తామన్నారు,. అంతా బలహీన వర్గాలకు సంబంధించిన వాళ్ళు కావడంతో ప్రభుత్వం సహాయం కోసం ఎదురుచూస్తున్నారు, కొడవటిపూడి గ్రామంలో కొంకిపూడి పుల్లమ్మ, కోటవురట్ల గ్రామంలో భోగరాజు వెంకటేశ్వరరావు, లంక మంగయమ్మా, వెంకటాపురం గ్రామంలో గుడాల సత్యనారాయణలకు చెందిన ఇల్లు కూలిపోవడంతో పాటుగా వారంలో పందూరు గ్రామంలో మామిడి లక్ష్మి ఇంటిపై కొండ చరియ విరిగిపడి దెబ్బ తినడంతో వీరంతా ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం కోసం ఎదురుచూస్తున్నారు. .

వంతెన సమస్యను పరిష్కరించండి

ప్రజాశక్తి -కోటవురట్ల : మండలంలోని పాములవాక గ్రామంలో ఏలేరు కాలువపై నిర్మించిన వంతెన నిరుపయోగంగా మారడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారు. మంగళవారం టిడిపి సీనియర్ నాయకులు భాస్కరరావు వంతెనను పరిశీలించి సమస్యను పరిష్కరించాలని కోరారు, రైతుల సౌకర్యార్థం నిర్మించిన వంతెనపై,దాదాపుగా నాలుగు అడుగులు మేర నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వంతెనపై ఇరువైపులా నిర్మించిన గోడపై నుంచి ప్రమాదభరితంగా రైతులు రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొంది, మంగళవారం సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు సందర్శించి, వంతెనపై నిలిచిన నీటి తొలగింపునకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు

పరిహారం చెల్లించకుండా పనులు చేపట్టొద్దు

అధికారుల దూకుడు చర్యలు దుర్మార్గం : సిపిఎం

ప్రజాశక్తి- నక్కపల్లి : వైజాగ్, చెన్నై ఇండస్ట్రీయల్ కారిడార్ నిర్వాసితుల సమస్యలకు పరిష్కారం చూపకుండా పనులు చేపట్టడం సరికాదని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు అన్నారు .మండలంలోని చందనాడ రెవెన్యూలో పనులు చేపట్టడం 2013 భూసేకరణ చట్టాన్ని ఉల్లంఘించడమే అవుతుందన్నారు. ఇళ్ల తొలగిస్తున్నవారికి ఎక్కడ పునరావాసం కల్పిస్తారు, ప్యాకేజీ ఎంత ఇస్తారు, ఏ సంవత్సరానికి కటాఫ్ తేదీగా నిర్ణయించి 18ఏళ్లు నిండిన వారిని ప్యాకేజీకి ఎంపిక చేస్తారు అనే విషయాలను స్పష్టత లేకుండా ప్రభుత్వం ఈ విధంగా పనులు చేపట్టడం సరైనది కాదన్నారు .సమస్యలు పరిష్కరించకుండా పనులు ఎలా చేపడతారని ప్రశ్నించారు.పనులు నిలుపుదల చేసి నిర్వాసితులు సమస్యలు పరిష్కారం చేయాలని కోరారు.

భూములు, సర్వసం కోల్పోయిన నిర్వాసితులను



నిర్వాసితులతో కలిసి మాట్లాడుతున్న అప్పలరాజు

ఆదుకోకుండా, నిర్వాసితులు హక్కులను ఉల్లంఘించి చట్ట విరుద్ధంగా పనులు చేపడుతున్న అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని, నిర్వాసితులకు న్యాయం జరిగే వరకూ పోరాడుతామని స్పష్టం చేశారు. చందనాడ రెవెన్యూలో సర్వేనెంబర్ 65లో పేమెంట్లు చెల్లించకుండానే జెసిబిలతో పనులు చేపట్టడం ఎంతవరకు సమంజసమని నిర్వాసితులు ప్రశ్నించారు .

విశాఖ ఉక్కును సెయిల్‌లో విలీనం చేయాలి

ప్రజాశక్తి -నక్కపల్లి :.విశాఖ స్టీల్ ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని, పూర్తిసామర్థ్యంతో ఫ్యాక్టరీని నడపాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం అప్పలరాజు డిమాండ్ చేశారు మంగళవారం స్టీల్ ప్లాంట్ పరిరక్షణ పోరాట కమిటీ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా పాయకరావుపేటలో సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థ విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ చర్యలను కేంద్ర బిజెపి ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమిలో భాగస్వాములైన టిడిపి, జనసేన పార్టీలు స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బి.నాగేశ్వరరావు,డి.సతీష్ కుమార్, గంగారావు,కాశీం, వీర్రాజు, ఆచారి పాల్గొన్నారు

జమ్మాదేవిపేటలో 'పిఎం జన్‌మన్' గ్రామసభ

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలోని పప్పుశెట్టిపాలెం శివారు జమ్మాదేవిపేట గ్రామంలో సర్పంచ్ మాకిరెడ్డి విజయలక్ష్మి అధ్యక్షతన పీఎం జన్‌మన్ కార్యక్రమంపై గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ పీఎం జన్ మన్ పథకాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ పథకం ద్వారా గిరిజన గ్రామాల్లో సంపూర్ణ అభివృద్ధి జరుగుతుందన్నారు

రోడ్డుకిరువైపులా తుప్పల తొలగింపు

ప్రజాశక్తి - కోటవురట్ల : మండలంలోని పాములవాక గ్రామ పరిసర ప్రాంతాలలో రోడ్లకు ఇరువైపులా పేరుకుపోయిన తుప్పలను వైసిపి మండల అధ్యక్షులు, మాజీ సర్పంచ్ కిల్లాడ శ్రీనివాసరావు చొరవతీసుకుని రోటోవీటర్ ట్రాక్టర్‌తో తొలగించారు. రోడ్డుకు ఇరువైపులా తుప్పలు పెరిగి రాకపోకలకు వాహనదారులు, ప్రజలు ఇబ్బందులకు గురౌతున్నారు. అంతేకాక విష సర్పాల సంచారం ప్రజలను బెంబేలెత్తిస్తోంది. రైతులు, వాహనదారుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని, శ్రీనివాసరావు చొరవ తీసుకుని, తుప్పలు తొలగించడంతో ప్రజలు హర్షం, ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆర్ అండ్ బి అధికారులకు పలుమార్లు చెప్పినాపట్టించుకోకపోవడంతో, తానే తుప్పలను తొలగిస్తున్నట్లు శ్రీనివాసరావు వెల్లడించారు.

గర్భిణులకు పాలు, రొట్టెల పంపిణీ

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలోని కృష్ణదేవిపేట పిహెచ్‌సిలో ఏఎల్ పురం శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం గర్భిణులకు పాలు, బ్రెడ్ పీహెచ్‌సి వైద్యులు డాక్టర్ హరిప్రవీణ్, గాయత్రి పంపిణీ చేశారు.సత్యసాయి సేవాసమితి సభ్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

13న వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : గ్రీన్ క్లబ్-నర్సీపట్నం అధ్వర్యంలో ఈనెల 13న ఐదు రోడ్ల జంక్షన్ వద్ద గల జిల్లా పరిషత్ మెయిన్ హైస్కూల్‌లో వ్యాసరచన పోటీలను నిర్వహిస్తున్నట్లు గ్రీన్ క్లబ్ అధ్యక్షులు గోపీనాధ్ తెలిపారు. ఈనెల 16న. అంతర్జాతీయ ఓజోన్ పరిరక్షణ' దినోత్సవం సందర్భంగా నిర్వహించే వ్యాసరచన పోటీలను విజయవంతం చేయాలని నర్సీపట్నం డివిజన్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఓజోన్ పొర ఆవశ్యకత- దానిని ఎలా కాపాడు కోవాలి అనే అంశంపై 6వ తరగతి నుంచి 10 వ తరగతి విద్యార్థులకు డివిజనల్ స్థాయిలో వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. డివిజన్‌లో గల అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు. పాల్గొనాలని పిలుపునిచ్చారు.

14న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : ఈ నెల 14వ తేదీన దేశవ్యాప్తంగా జరిగే నేషనల్ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని మండల లీగల్ సర్వీసెస్ కమీటి చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి షియాజ్ ఖాన్ తెలిపారు. శనివారంకోర్టు సముదాయంలో పోలీసు ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజీ పడదగిన సివిల్, క్రిమినల్ కేసుల కక్షిదారులకు అవగాహన కల్పించాలని పోలీసులకు సూచించారు. లోక్‌అదాలతో కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకోవడం ద్వారా వారికి సమయం, డబ్బు వృథా కాదన్న విషయం తెలియజెప్పాలన్నారు. కార్యక్రమంలో నర్సీపట్నం టౌన్ రూరల్ పోలీసులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కొత్తకోట విద్యార్థులు

ప్రజాశక్తి -కొత్తకోట : రావికమతం మండలం కొత్తకోట పిఎస్ఆర్ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు జిల్లా స్థాయి అథ్లెటిక్స్ హైజంప్ పోటీలలో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం నాగేశ్వర రావు, పీడీ రామచంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం వారు తెలిపిన వివరాలు మేరకు, పాఠశాలకు చెందిన బంటు జనని, కొప్పుల పూజిత జిల్లా స్థాయిలో ఆంధ్ర యూనివర్సిటీలో జరిగిన అథ్లెటిక్స్‌లో భాగంగా హైజంప్ పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. త్వరలో గుంటూరులో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థినులను పలువురు ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.

మహాలక్ష్మినాయుడుకు ఘన సత్కారం

ప్రజాశక్తి -కొత్తకోట: వికలాంగ విద్యార్థులకు టాబ్స్ ఉపయోగించి ప్రత్యేక విద్య అందించడంలో తర్ఫీదునిచ్చిన ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్ష సహిత విద్య రాష్ట్ర కీ రిసోర్స్ పర్సన్, మేడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ ప్రత్యేక ఉపాధ్యాయుడు మహాలక్ష్మి నాయుడును ఘనంగా సత్కరించారు.రావికమతం మండలంలో అందించిన సేవలకు, అలాగే బాపట్ల జిల్లా సహిత విద్య రిసోర్స్ పర్సన్, ఐఈఆర్‌పిలకు, డిజిటల్ ట్యాబ్‌లలో ఉన్న యాప్‌లను ఉపయోగించి వికలాంగులకు ఎలా విద్యాబోధన చేయాలి, వాటి ఉపయోగాలపై మహాలక్ష్మి నాయుడును ప్రత్యేక శిక్షణను అందించారు. ఈ సందర్భంగా ఆయనను అధికారులు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆంధ్రప్ర దేశ్ రాష్ట్ర సమగ్ర శిక్ష సహిత విద్యా విభాగం అధికారులు, బాపట్ల జిల్లా సహిత విద్యా విభాగం అధికారి మల్లికార్జునరావు, కీ రిసోర్స్ పర్సన్ సునీల్, ఐఇఆర్‌పి లు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

ప్రజాశక్తి-గొలుగొండ : స్థానిక ఎస్ఐ పి.రామారావు ఆధ్వర్యంలో మంగళవారం వాహనాల తనిఖీలను నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలపై వెళ్లేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. కారులోప్రయాణించే వారు సీటు బెల్టు పెట్టకోవాలని సూచించారు.సంబంధిత వాహన రికార్డులు పరిశీలించారు. రికార్డులు, డ్రైవింగ్ లైసెన్స్‌లకు వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలను వాహనాల్లో పెట్టుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ దేవుడు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి గోడ కూలి మహిళకు గాయాలు

ప్రజాశక్తి-గొలుగొండ : తుపాన్ ప్రభావంతో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని పాత జోగుంపేట గ్రామానికి చెందిన వాసం త్రిమూర్తులమ్మకు చెందిన తాటాకింటి గోడ కూలిపోయింది. సోమవారం అర్ధరాత్రి జరిగిన ఈ ప్రమాదంలో త్రిమూర్తులమ్మ గాయపడింది. వెంటనే ఆమెను కుటుంబ సభ్యులు నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. గోడ కూలిపోవడంతో ఇంట్లో గృహోపకరణాలు దెబ్బతిన్నాయి. తనను ఆదుకోవాలని బాధితురాలు వేడుకుంటుంది.

'ఉక్కు' రక్షణ రాస్తారోకోలు విజయవంతం

విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ ఆపాలని, ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని, పూర్తి సామర్థ్యంతో ఉత్పత్తిని తీయాలని, అవసరమైన ముడి సరుకు కేటాయించాలని, కర్మాగారాన్ని సెయిల్‌లో విలీనం చేయాలని కోరుతూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ, అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి పిలుపు మేరకు విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో మంగళవారం చేపట్టిన రాస్తారోకోలు విజయవంతమయ్యాయి.

(ప్రజాశక్తి-యంత్రాంగం)

పలుచోట్ల నిరసన ప్రదర్శనలు

ఉక్కునగరం : విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలో జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. భారీ ఎత్తున కార్మికులు, నిర్వాసితులు, నిర్వాసిత కుటుంబాలు, ప్రజానీకం తరలివచ్చారు. పోలీసులు రాస్తారోకో చేస్తున్న నాయకులను అరెస్టు చేసి స్టీల్‌ప్లాంట్, గాజువాక పోలీస్‌స్టేషన్లకు తరలించారు. మంగళవారం మధ్యాహ్నం వారందరినీ విడిచిపెట్టారు. అరెస్టయిన వారిలో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్లు సిహెచ్.నర్సింగరావు, డి.ఆదినారాయణ, కన్వీనర్ కెఎస్ఎన్.రావు, నాయకులు వైటి.దాస్, విళ్ల రామ్మోహన్ కుమార్, పల్లా పెంటారావు, పివి.రమణమూర్తి, జివిఎంసి 78వ వార్డు ఉక్కునగరం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు తదితరులు ఉన్నారు.

రాస్తారోకోను ఉద్దేశించి సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌కు అవసరమైన ముడిసరుకు సమకూరిస్తే కార్మికుల ఉత్పత్తి చేయడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే కుట్రలో భాగంగానే స్టీల్‌ప్లాంట్‌ను నిర్వీర్యం చేస్తున్నారని, ఈ చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. ఈ ఉద్యమం మరింత ఉధృతం కానుందన్నారు. ప్రాణ త్యాగాలకైనా సిద్ధమై స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవడానికి కార్మికులు, నిర్వాసితులు నడుం బిగించారని తెలిపారు. డి.ఆదినారాయణ మాట్లాడుతూ భారతదేశంలోనే అతిపెద్ద పరిశ్రమ విశాఖ ఉక్కు కర్మాగారం ఎన్నో పోరాటాలు, త్యాగాలతో ఏర్పాటైందని, దీనిని వదులుకోబోమని స్పష్టంచేశారు. పోరాట కమిటీ కో-కన్వీనర్ జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ, రూ.మూడు లక్షల కోట్ల విలువైన విశాఖ ఉక్కు కర్మాగారాన్ని అదానీ, అంబానీ వంటి ప్రయివేటు వ్యక్తులకు కట్టబెట్టడాన్ని చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. స్టీల్ ప్లాంట్‌ను సామర్థ్యానికి తగ్గ ఉత్పత్తితో నడిపించాలని మాత్రమే కార్మికుల పోరాటం చేస్తున్నారని గుర్తుచేశారు. ప్రజల హక్కు అయిన విశాఖ ఉక్కు ప్రభుత్వ ఆస్తిగానే ఉండాలి కానీ ప్రైవేటు పరం కానివ్వబోమన్నారు.



పరవాడలో రాస్తారోకో చేస్తున్న సిఐటియు నేతలు

విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన..

ఎంవిపి.కాలనీ : స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జివిఎంసి గాంధీ విగ్రహం నుంచి ఆర్‌టిసి కాంప్లెక్స్ వరకూ ప్రదర్శన చేపట్టి రాస్తారోకో నిర్వహించారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కేంద్ర బిజెపిపై ఒత్తిడి తెచ్చి ప్లాంట్ ప్రైవేటీకరణను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి పి.మణి, నాయకులు వి.కృష్ణారావు, పి.వెంకటరెడ్డి, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జిఎస్‌జె.అచ్యుతరావు, అధ్యక్షులు ఎం.మన్మధరావు, సహాయ కార్యదర్శి ఎస్‌కె.రెహమాన్, ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.వెంకటేశ్వర్లు, ఐఎన్‌టియుసి జిల్లా కార్యదర్శి భోగవిల్లి నాగభూషణం, ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.పద్మ, వై.సత్యవతి, సిపిఎం నాయకులు నరేంద్ర కుమార్, పిఒడబ్ల్యు జిల్లా కార్యదర్శి కెఎస్.వెంకటలక్ష్మి, ప్రధాన కార్యదర్శి రోహిణి, ఎపిఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు గణేష్ పండా, దేవా తదితరులు పాల్గొన్నారు. రాస్తారోకోలో పోలీసులకూ, నాయకులకూ మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది.

పెందుర్తి : పెందుర్తి రైతు బజార్ జంక్షన్లో సిఐటియు, ఐద్వా ఆధ్వర్యాన రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి బి.జగన్, ఐద్వా జిల్లా నాయకులు బి.రమణి, జోన్ కార్యదర్శి జి.శంకరరావు, నాయకులు అప్పలనాయుడు, రాజు, సత్య, ముత్యాలమ్మ, అప్పలనరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

గాజువాక : సిఐటియు, ఎఐటియుసి ఆధ్వర్యాన పాత గాజువాక జంక్షన్లో రాస్తారోకో చేశారు. ముందుగా కొత్త గాజువాక నుంచి పాత గాజువాక వరకు ప్రదర్శన చేశారు. అనంతరం పాతగాజువాక జంక్షన్‌లో రాస్తారోకో చేపట్టారు. రాస్తారోకో చేస్తున్న సిఐటియు నాయకులు ఎం.రాంబాబు, కెఎం.శ్రీనివాసరావును పోలీసులు అరెస్టు చేశారు. సిఐటియు నేతలు ణితి అప్పలరాజు, ఎ.లోకేశ్వరరావు, పాల వెంకయ్య, నమ్మి రమణ, బి.గుర్రప్ప, డి.రమణ, ఎం.శ్రీదేవి, జి.లక్ష్మి, కె.సంతోషం, ఎఐటియుసి నాయకులు కసిరెడ్డి సత్యనారాయణ, విష్ణుమూర్తి, అచ్యుతరావు పాల్గొన్నారు.

మధురవాడ : సిఐటియు మధురవాడ జోన్ కమిటీ ఆధ్వర్యాన జివిఎంసి జోనల్ కార్యాలయం వద్ద సేవా రహదారిలో రాస్తారోకో నిర్వహించారు. ప్ల కార్డులు ప్రదర్శించి పెద్దఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో సిఐటియు నేతలు పి.రాజ కుమార్, డి.అప్పలరాజు, జి.మంగశ్రీ, ఆవాల లక్ష్మణ, డి.రవి, రాజు, వెంకటేష్, పి.వరలక్ష్మి, ఐద్వా నాయకులు బి.భారతి, కె.పద్మ పాల్గొన్నారు.

గోపాలపట్నం : సిఐటియు గోపాలపట్నం డివిజన్ కమిటీ ఆధ్వర్యాన గోపాలపట్నం బిఆర్‌టిఎస్ రోడ్డులో ర్యాలీ నిర్వహించారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని నినాదాలు చేశారు. సిఐటియు గోపాలపట్నం డివిజన్ కమిటీ కార్యదర్శి ముద్దాడ వరప్రసాద్, నాయకులు రాజాన శేషగిరి, ఆర్.శ్రీనివాసరావు, సీరం రమణ, సిపిఎం నేతలు బలివాడ వెంకటరావు పాల్గొన్నారు.

ములగాడ : అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యాన హెచ్‌పిసిఎల్ గేట్ వద్ద నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మల్కాపురం జోన్ అధ్యక్షులు కె.పెంటారావు, ప్రధాన కార్యదర్శి ఆర్. లక్ష్మణమూర్తి, నాయకులు పి.పైడిరాజు జి.నరేష్, ఎం.కృష్ణారావు, పి.సురేష్, రాజేష్, గంగాధర్, బుజ్జీరాజు, ఐఎన్‌టియుసి జిల్లా కార్యదర్శి బోగవిల్లి నాగభూషణం, నాయకులు తాతబాబు, నర్సింగ్, కార్మికులు పాల్గొన్నారు.



పాత గాజువాకలో రాస్తారోకో చేస్తున్న సిఐటియు, ఎఐటియుసి నాయకులు

తగరపువలస : సిఐటియు భీమిలి జోన్ కమిటీ ఆధ్వర్యాన తగరపువలస వై.జంక్షన్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. నాయకులు రవ్వ నరసింగరావు, కార్మికులు పి.పెంటరాజు, పి.రమణ, పి.రామకృష్ణ పాల్గొన్నారు

సీతమ్మధార : గురుద్వార జంక్షన్‌లో ఆటో డ్రైవర్లు రాస్తారోకో చేశారు.

రాష్ట్రవ్యాప్త రాస్తారోకోలు జయప్రదం

- సిహెచ్.నర్సింగరావు

విశాఖపట్నం : వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని, పూర్తిస్థాయి సామర్థ్యంతో నడపాలని డిమాండ్ చేస్తూ మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన రాస్తారోకోలు జయప్రదమయ్యాయని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ సిహెచ్.నర్సింగరావు తెలిపారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. అన్ని జిల్లాల్లో రాస్తారోకోలకు ప్రజల నుంచి స్పందన లభించిందని పేర్కొన్నారు. శాంతియుతంగా రాస్తారోకోలు చేస్తున్న వారిని విశాఖలో పలుచోట్ల అరెస్టు చేయడాన్ని ఆయన ఖండించారు. గత మూడున్నర సంవత్సరాల్లో ఎన్నడూ లేని విధంగా పోలీసులు అరెస్టులకు పాల్పడ్డారని తెలిపారు. రెండు నెలల కిందట విశాఖ స్టీల్‌ప్లాంట్ సందర్శన సమయంలో కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమార స్వామి ఇచ్చిన హామీ నేటికీ నెరవేరలేదన్నారు. ఆయన వచ్చినప్పటికీ, ఇప్పటికీ పరిస్థితి మరింత దిగజారిందని తెలిపారు. ఉక్కు ఉత్పత్తిని కుదిస్తున్నారని, మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌లకుగాను ఒక దాన్నే నడపాలని నిర్ణయించారని పేర్కొన్నారు. దీని వల్ల ప్రతినెలా రూ.450 కోట్ల నష్టం వాటిల్లుతుందన్నారు. ఈ నేపథ్యంలో స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలన్నారు. తగిన ముడిసరుకును సరఫరా చేసి పూర్తి ఉత్పత్తి సామర్థ్యంతో నడపాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తక్షణం జోక్యం చేసుకొని ప్లాంట్ పరిరక్షణకు కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి, రావి కృష్ణ, ఎన్.పాపారావు, ఎన్.సూరిబాబు, ఎ.నర్సింగ్‌మూర్తి, పి.బుజ్జి, రవి, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి : విశాఖ స్టీల్‌ప్లాంట్ పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరికి నిరసనగా కేంద్ర కార్మిక సంఘాలు రైతు సంఘాల ఆధ్వర్యాన మంగళవారం అనకాపల్లి నాలుగు రోడ్ల సెంటర్లో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కె లోకనాథం మాట్లాడుతూ విశాఖస్టీల్ దేశంలోనే నాణ్యమైన డిమాండ్ ఉన్న స్టీల్ అని, కేంద్ర బీజేపీ ప్రభుత్వం కావాలనే ఉత్పత్తి తగ్గించి విశాఖ స్టీల్‌ను నష్టాల్లోకి నెట్టి ప్రైవేట్‌కు అప్పగించాలని కుట్ర చేస్తున్నదని విమర్శించారు. 45 రోజుల్లో స్టీల్‌ప్లాంట్‌ను రక్షించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తానని, మోడీని ఒప్పించి ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడిపిస్తామని కేంద్ర ఉక్కు మంత్రులు ప్రకటించి రెండు మాసాలు దాటినా నేటికీ ఆ దిశగా ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. పైగా ప్లాంట్‌ను నాశనం చేయడానికి అన్ని ప్రయత్నాలు ముమ్మరం చేసిందని పేర్కొన్నారు. టిడిపి మద్దతుతోనే కేంద్ర బీజేపీ ప్రభుత్వం నడుస్తుందని, ఎన్డీఏలో భాగస్వామిగా ఉండి కూడా విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ఎందుకు కాపాడలేకపోతుందని ప్రశ్నించారు. ఇప్పటికైనా టీడీపీ నాయకత్వం కేంద్ర బీజేపీపై ఒత్తిడి తెచ్చి విశాఖ స్టీల్‌ను కాపాడాలని కోరారు. ఆర్.శంకరరావు, జి కోటేశ్వర రావు, వివి.శ్రీనివాస రావు గనిశెట్టి సత్యనారాయణ, గంటా శ్రీరామ్, డి.శ్రీనివాస రావు, భీశెట్టి అప్పారావు కాపుసెట్టి అప్పారావు, పి.పరమేశ్వర రావు, నాయుడు, బొమ్మల రాము, జి.అప్పారావు, కాళ్ల తేలయ్య బాబు, (సిఐటియు), ఆర్.దొరబాబు, వైఎన్. భద్రం, పెంటకోట సత్యనారాయణ, కె.త్రినాథ్, కోన లక్ష్మణ్, వీరచారి, నరాలశెట్టి సత్యనారా యణ, తాకాశి వెంకటేశ్వరరావు, ప్రసాద్, చిన్ని (ఏఐటీయూసీ), సిహెచ్.రాంబాబు (ఏఐఎఫ్టియు), కర్రి అప్పారావు (రైతు సంఘం), డిడి.వరలక్ష్మి (ఐద్వా) పాల్గొన్నారు.

పరవాడ : మండలంలోని లంకెలపాలెంలో మెయిన్ రోడ్‌పై సిఐటియు ఆధ్వర్యంలో విశాఖ స్టీల్ ప్లాంట్‌ను సెయిల్లో విలీనం చేయాలని కోరుతూ రాస్తారోకో నిర్వహించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, నాయకులు వై రమణ, ఎస్ అప్పారావు, రామారావు, నర్సింగరావు, చిన్నారావు పాల్గొన్నారు.

కశింకోట : విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ చేయవద్దని కోరుతూ స్థానిక బజార్ నాలుగు రోడ్ల కూడలిలో ప్రజా సంఘాల ఆధ్వర్యాన రాస్తారోకో చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు దాకారపు శ్రీనివాసరావు, ఐద్వా జిల్లా కార్యదర్శి డిడి.వరలక్ష్మి, కొండబాబు, రామోజీ, దేవుడు, అబ్బులు, లక్ష్మణ, లక్ష్మి, రాణి, అంజి పాల్గొన్నారు.

అచ్యుతాపురం : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడపాలని డిమాండ్‌తో అచ్యుతాపురం జంక్షన్‌లో సిఐటియు ఆధ్వర్యంలో రాస్తారోకో చేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము, మండల కార్యదర్శి కె.సోమునాయుడు, ధూళి వెంకయ్య నాయుడు, కాకి సూరిబాబు, ఒడిసిల రాము, పెంకె శ్రీను, వై అప్పలరాజు, కె మహేష్ , లోవ పాల్గొన్నారు



ములగాడ ఆందోళనలో మాట్లాడుతున్న ఆర్.లక్ష్మణమూర్తి



పెందుర్తిలో రాస్తారోకోలో పాల్గొన్న సిఐటియు, ప్రజాసంఘాల నేతలు



మధురవాడలో సిఐటియు నేతల రాస్తారోకో



తగరపువలసలో రాస్తారోకో


కశింకోటలో సిఐటియు నేతల మానవహారం



అచ్యుతాపురంలో ప్లకార్డులతో సిఐటియు రాస్తారోకో